# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 153 | విశాఖపట్నం | 5-3-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 153 | VISAKHAPATNAM | 5-3-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## శాసన మండలిలో 'లడ్డూ' రగడ

## వైసీపీ-కూటమి సభ్యుల మధ్య


# మాటల యుద్ధం





**అమరావతి, పతాకం న్యూస్:** తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో వాడే నెయ్యి కల్తీ జరిగిందనే అంశం ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పెను దుమారం రేపింది. ఈ సున్నితమైన, కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న విషయంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రదర్శించింది. దాదాపు 20 పేజీలతో కూడిన సుదీర్ఘ నివేదికను సభలోని సభ్యులందరికీ అందజేసింది. ఈ నివేదికలో లడ్డూకు ఉన్న విశిష్టమైన చారిత్రక నేపథ్యం, దశాబ్దాలుగా పాటిస్తున్న తయారీ విధానాలు, వాడే దినుసుల ప్రమాణాలు, అలాగే తిరుమలలో వంశపారంపర్యంగా వస్తున్న పోటు-మిరాసీ వ్యవస్థ వంటి కీలక వివరాలను ప్రభుత్వం సవివరంగా పొందుపరిచింది. లడ్డూ కల్తీ ఆరోపణలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు నాయుడు చేసినవి కావని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (చీఐఐడీ) అనే జాతీయ స్థాయి స్వతంత్ర సంస్థ ఇచ్చిన శాస్త్రీయ నివేదికల ఆధారంగానే ప్రభుత్వం ఈ వాస్తవాలను బయటపెట్టిందని ఆయన గుర్తు చేశారు. చర్చ జరుగుతున్న సమయంలో వైఎస్సార్సీపీ సభ్యులు వ్యవహరించిన తీరుపై అధికార పక్ష మంత్రులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ఒకే అంశంపై రెండు విభిన్న తీర్మానాలు ఇవ్వడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని మంత్రి నాదెండ్ల మనోహర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

సభలో గందరగోళం సృష్టిస్తూ చర్చను అడ్డుకుంటున్న ప్రతిపక్ష సభ్యులపై మంత్రి పయ్యావుల కేశవ్ నిప్పులు చెరిగారు. ప్రభుత్వం వాస్తవాలు వివరించేటప్పుడు వాకౌట్ చేసి పారిపోకుండా, నిజాన్ని వినే ధైర్యం చూపాలని ఆయన సవాల్ విసిరారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, దోషులను ప్రజల ముందు నిలబెట్టే వరకు విశ్రమించబోమని ఆయన ఘంటాపథంగా చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే వివరణకు ఎలాంటి సమయ నిబంధనలు ఉండవని, సభ ఎంతసేపు జరిగినా తాము సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. బట్ట కాల్చి ముఖాన వేసి పారిపోయే పద్ధతిని విడనాడాలని ఆయన ప్రతిపక్షాన్ని హెచ్చరించారు.



2లో

## హోర్ముజ్ జలసంధి వద్ద నిలిచిపోయిన 37 భారత నౌకలు



2లో

## ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి



6లో

## జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే..

## విజయవాడలో జర్నలిస్టుల భారీ ర్యాలీ



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ (ఎపిబిజెఎ) సంయుక్త ఆధ్వర్యాన 'జర్నలిస్టుల చలో విజయవాడ' కార్యక్రమంలో భాగంగా బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులంతా ర్యాలీగా ప్రారంభమై విజయవాడలోని రాఘవయ్య పార్కు నుండి బందరులాకులు, పాతబస్టాండ్ మీదుగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు సాగారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని (తరువాయి 2వ పేజీలో)



## విజయవాడ-విశాఖ మధ్య బుల్లెట్ రైలు..

2లో


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH


## 30 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు.. నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్: అనిత



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ శాసనసభలో విపత్తు నిర్వహణ చట్టం సవరణ బిల్లును హోంమంత్రి వంగలపూడి అనిత ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించిన చట్టంలో మార్పులు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు రావటంతో మార్పులు అవసరమైనట్లు చెప్పారు. ఈ సవరణ ద్వారా భవన నిర్మాణ అనుమతులను జాతీయ నిబంధనల మేరకు సవరించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

(తరువాయి 4వ పేజీలో)

## వర్సిటీల్లో 3,371 పోస్టుల భర్తీ: లోకేశ్

**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 3,371 అధ్యాపక పోస్టులను రాబోయే మూడు నెలల్లో యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శాసనమండలిలో స్పష్టం చేశారు. ఈ నియామకాల కోసం పూర్తిస్థాయిలో న్యాయపరమైన చిక్కులను అధిగమించి, కొత్త నోటిఫికేషన్ జారీ చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆయన ప్రకటించారు. బుధవారం శాసనమండలిలో సభ్యుడు బొర్రా గోపిమూర్తి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ బదులిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో 3,371 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ ఖాళీల భర్తీ కోసం 2018, 2023లో గత ప్రభుత్వాలు నోటిఫికేషన్లు ఇచ్చినా, అవి ముందుకు సాగలేదన్నారు. ముఖ్యంగా 2023 నాటి నోటిఫికేషన్‌లో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను సరిగ్గా పాటించకపోవడంతో (తరువాయి 2వ పేజీలో)





## నా ఆస్తులపై దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు: అంబటి రాంబాబు

2లో

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELUGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## అమానుషకాండ

అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచుతామని, వారి సమస్యలు పరిష్కరిస్తామని ప్రతిపక్షంలో ఉండగా హామీలు గుప్పించిన టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక నిర్బంధం విధించడం దారుణం. శాంతియుతంగా మహా ధర్నా నిర్వహించి, శిబిరంలోనే నిద్రిస్తున్న వెయ్యిమందికిపైగా మహిళల పట్ల అమానుషంగా వ్యవహరించి, ప్రజాతంత్ర ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నించడం పాశవికం. పోలీసుల బీభత్సానికి సంఘం నాయకులు బేబీ రాణి చేయి విరగ్గా పలువురు గాయాల పాలయ్యారు. పిన్నులతో గుచ్చడం, తాళ్లు వేసి, ముసుగుగుడ్డ కప్పి బలవంతంగా వ్యానుల్లో కుక్కడం, బ్యాగులు, సెల్‌ఫోన్లు సైతం తీసుకోనీయకపోవడం, అరెస్టు చేసి వంద కిలోమీటర్లకుపైగా దూరంలోని ప్రాంతాలకు తరలించడం, కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా అనుమతించకుండా మగ పోలీసులు వ్యవహరించిన తీరు మానవ హక్కుల ఉల్లంఘనే. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016లో సుప్రీంకోర్టు చెప్పింది. అంగన్‌వాడీ ఉద్యోగుల నియామకంలో కాంట్రాక్టర్లు, ఏజెంట్లు వంటి మధ్యవర్తులెవరూ ఉండరు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెగ్యులర్ ఉద్యోగుల్లో చిట్టచివర ఉన్న వారికి చెల్లించే కనీస వేతనం, డిఎ, ఇతర అలవెన్సులు కలిపి రూ.26 వేలు ఇవ్వాలి. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. ఇవేవీ వారికి అమలు చేయడం లేదు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే వేతనం కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాటమార్చి, అంగన్‌వాడీ ఉద్యమంపై ఎస్మా ప్రయోగించి అప్రతిష్ట పాలైంది. 42 రోజుల సమ్మె అనంతరం సమస్యలపై ఒప్పందం చేసుకుంది. నాటి ఉద్యమానికి మద్దతు ప్రకటించి, మెరుగైన వేతనాలిస్తామని ఊరూవాడా శిబిరాల్లో ప్రకటించిన టిడిపి కూటమి నేతలు నేడు బీభత్సానికి పాల్పడటం.. ఏరు దాటే వరకూ ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న... అన్న చందంగా ఉంది. 2024 జూన్ నుంచి వేతనం పెంచుతామని గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని సైతం కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. మన రాష్ట్రంతో పోలిస్తే తెలంగాణలో రూ.2,150 అధిక వేతనం ఇస్తున్నారు. మరో రూ.5 వేలు పెంచుతామని ఆ రాష్ట్ర మంత్రి ప్రకటించారు. చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు. ఏడేళ్లుగా వేతనాలు పెరగకపోవడం, ధరలు విపరీతంగా పెరగడంతో జీవనం దుర్భరంగా మారడం, అధికారంలోకి వచ్చి 22 నెలలైన తరువాత కూడా సర్కారులో చలనం లేకపోవడం వల్లే మహాధర్నాకు అంగన్‌వాడీలు పూనుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా మహిళలు తరలివచ్చి తమ గళం వినిపించారు. దోమలు కుడుతున్నా, మురుగు కంపు కొడుతున్నా, నడిరోడ్డుపై ధర్నా శిబిరంలోనే నిద్రించిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు సరికాదు. తెల్లవారుజామున కరెంట్ కట్ చేయడం, మధ్యలో తెరలు వేసి మరీ.. మహిళలన్న విచక్షణ కూడా లేకుండా దుర్మార్గంగా వ్యవహరించడం, మగ పోలీసులతో నిర్బంధానికి పాల్పడటం, తెల్లవారుజాము నుంచి 10 గంటల వరకూ వాహనాల్లోనే తిప్పడం అత్యంత అమానుషం. పోలీసుల తీరుపై మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్ చర్య తీసుకోవాలి. ఆరో సంవత్సరం వరకూ పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించడం, చిన్నారులకు ప్రీప్రైమరీ విద్యను అందించడం, ప్రభుత్వ పథకాలన్నీ క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న అంగన్‌వాడీలపై విరుచుకుపడటం ప్రభుత్వానికి తగదు. గుర్రాలతో తొక్కించి అప్రతిష్టను మూటగట్టుకున్న గత అనుభవాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం గుర్తెరగాలి. ఎంతటి నిర్బంధాన్నయినా ఎదిరించి పోరాడిన చరిత్ర ఉన్న అంగన్‌వాడీ అక్కచెల్లమ్మలను అణచివేయాలనుకున్నప్పుడల్లా పాలకులు ఘోర ఓటమిని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. కార్మికులను, కష్టజీవులను అణచివేయాలని చూస్తే ఉద్యమాలు ఎగసిపడతాయన్నది చారిత్రక సత్యం. ప్రతిష్టకు పోకుండా అంగన్‌వాడీ సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలి. వారితో చర్చించి, న్యాయమైన వేతనాల పెంపు తదితర డిమాండ్లను నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ కనీస బాధ్యత.

## విజయవాడ-విశాఖ మధ్య బుల్లెట్ రైలు..

### రైల్వే శాఖ కీలక ప్రతిపాదన



**విజయవాడ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రైల్వే శాఖ కీలక ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్రంలోని రెండు ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం మధ్య బుల్లెట్ రైలు నడిపేందుకు హైస్పీడ్ కారిడార్‌ను, మరోవైపు విజయవాడ నుంచి కర్నూలుకు సెమీ హైస్పీడ్ కారిడార్‌ను నిర్మించాలని పరిశీలిస్తోంది. వీటితో పాటు రాష్ట్రంలో మరో ఆరు కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రాజెక్టులన్నింటికీ ఫైనల్ లొకేషన్ సర్వే చేసేందుకు అనుమతి కోరుతూ అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. బోర్డు నుంచి ఆమోదం లభిస్తే ఈ పనుల్లో ముందడుగు పడుతుంది. విజయవాడ-విశాఖపట్నం మధ్య దాదాపు 350 కిలోమీటర్ల మేర ఈ హైస్పీడ్ రైల్ కారిడార్‌ను నిర్మించాలని భావిస్తున్నారు. ఇది కార్యరూపం దాల్చితే గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో బుల్లెట్ రైళ్లు పరుగులు పెడతాయి. ఏలూరు, రాజమహేంద్రవరం, కాకినాడ మీదుగా ఈ మార్గాన్ని ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రం మీదుగా మూడు హైస్పీడ్ కారిడార్లకు ప్రతిపాదనలు ఉండగా, ఇది నాలుగోది కానుంది. ప్రస్తుతం విజయవాడ నుంచి కర్నూలుకు నేరుగా రైలు సౌకర్యం లేదు. ఈ నేపథ్యంలో రెండు నగరాల మధ్య 350 కిలోమీటర్ల మేర సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మించాలని రైల్వేశాఖ ప్రతిపాదించింది. గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం, నంద్యాల మీదుగా ఈ లైన్‌ను నిర్మించనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే గంటకు 220 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తూ, కేవలం 2 గంటల్లోనే విజయవాడ నుంచి కర్నూలుకు చేరుకునే అవకాశం ఉంటుంది. వీటితో పాటు పల్నాడు జిల్లా మాచర్ల నుంచి తెలంగాణలోని గద్వాల్ వరకు (184 కి.మీ.), నెల్లూరు నుంచి రాజంపేటకు (120 కి.మీ.) నేరుగా కొత్త లైన్లు వేయాలని ప్రతిపాదించారు. ముఖ్యంగా, ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి రైలు సౌకర్యం కల్పించేందుకు హైదరాబాద్ నుంచి శ్రీశైలం మీదుగా మార్కాపురం వరకు కొత్త రైలు మార్గాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఈ ప్రతిపాదనలన్నింటికీ రైల్వే బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇస్తే సర్వే పనులు ప్రారంభం కానున్నాయి.

## ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి



**చిత్తూరు, పతాకం న్యూస్:** చిత్తూరు జిల్లా పలమనేరు జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీని వెనుక నుండి కారు ఢీ కొట్టడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతులు కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరం రాజాజీ నగర్ కు చెందిన వారుగా గుర్తించారు. బెంగళూరు నుండి తిరుమలకు వెళుతుండగా ప్రమాదం జరిగింది.

## ఉపాధి పథకాన్ని రద్దుకు బీజేపీ కుట్ర: షర్మిల



**చీరాల, పతాకం న్యూస్:** పేదలకు అనుకూలంగా ఉపాధిపరంగా ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేస్తుంది అని రాష్ట్ర కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి విమర్శించారు. బుధవారం ఇంకొల్లు సినిమా హాల్ సెంటర్ లో ఉపాధి హామీ పథకం గురించి నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సభలో పాల్గొన్న ఉపాధి హామీ కూలీలు పలువురితో ముందుగా వారి అభిప్రాయాలన్ని బహిరంగంగా తెలిపారు. సభలో వారు చెప్పిన సమస్యలు విన్న అనంతరం షర్మిలా మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ .... కాంగ్రెస్ హయాంలో పేదల కోసం ఉపాధి కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేసే కుట్ర కొనసాగిస్తుందని విమర్శించారు. అందులో భాగంగా ముందుగా మహాత్ముని పేరు తొలగించి విబి జి రాంజీ ఉపాధి హామీ పథకం అని నామకరణం చేశారన్నారు. తదుపరి ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టే విధంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పొడిగించామన్నారు. గతంలో వందరోజులకే పని కల్పించిన ఈ పథకాన్ని పేరుకు 125 రోజులు పని దినాలు కల్పించాము అని చెబుతున్నప్పటికీ అందులో చిత్తశుద్ధి లేదన్నారు. గతంలో గ్రామంలో పేద ప్రజలే తమకు పనిలేదని ఉపాధి కోసం గ్రామంలో పెద్దలను అధికారులను సంప్రదిస్తే వారికి ఉపాధి చూపించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించేవారన్నారు. అయితే ప్రస్తుత నూతన విధానంతో అందుకు అవకాశం లేదన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఎంతో మంచి గొప్ప పథకాన్ని తొలగించే ప్రయత్నం బిజెపి చేస్తుందని అన్నారు. పథకాన్ని గుండు సున్నా చుట్టేలా చేస్తుందన్నారు. ఇది బిజెపికి డబ్బులు వచ్చే పథకం కాదని అందువలన తొలగించారని అన్నారు.

## హోర్ముజ్ జలసంధి వద్ద నిలిచిపోయిన

# 37 భారత నౌకలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారతదేశం జెండాలు ఉన్న 37 నౌకలు హోర్ముజ్ జలసంధి తదితర ప్రాంతాల్లో నిలిచిపోయాయి. అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం కారణంగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 1,109 మంది నావికులతో కూడిన సుమారు 37 భారత జెండా కలిగిన నౌకలు పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్, సమీప ప్రాంతాల్లో నిలిచిపోయాయి. ఇందులో కొన్ని నౌకలు భారత ఓడరేవులకు ముడి చమురు, ఎల్ఎన్‌జీతో వస్తుండగా, మరికొన్ని గల్ఫ్ దేశాల నుంచి పెట్రోలియం ఉత్పత్తులు తీసుకురావడానికి వెళుతున్నవి ఉన్నాయి. డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఆయా కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తోందని తెలిపారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా విదేశీ జెండాలు కలిగిన నౌకల్లోని ముగ్గురు భారతీయ నావికుల మృతి చెందగా, ఒకరు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో మన నావికులు, మన నౌకల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేసింది. షిప్పింగ్ కంపెనీస్ అండ్ రిక్రూట్మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్సీస్ (ఆర్పీఎస్ఎల్ఎస్) నావికులకు కీలక సూచనలు జారీ చేసింది. యుద్ధం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, బంధువులతో క్రమం తప్పకుండా కమ్యూనికేట్ కావాలని సూచించింది. నావికుల కోసం హెల్ప్ లైన్ నెంబర్లను కూడా యాక్టివేట్ చేసింది.

## నా ఆస్తులపై దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు: అంబటి రాంబాబు



**గుంటూరు, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం తనపై, తన కుటుంబంపై చేసిన పాశవికమైన దాడి అందరూ చూశారని మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత అంబటి రాంబాబు పేర్కొన్నారు. తనపై దాడి చేసిన వారు మినహా.. రాష్ట్ర ప్రజలు దీనిని దారుణమైన సంఘటనగా పరిగణించారని చెప్పుకొచ్చారు. తన ఆస్తులపై కూడా దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తనకు సత్తెనపల్లిలో 22 ఎకరాల పొలం ఉందని.. ఆ పొలానికి కూడా సర్వే పేరుతో నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు. ఇవాళ(బుధవారం) గుంటూరు వేదికగా మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడారు. వారు తన ఆస్తుల మీద పడ్డారని... తాను లీగల్‌గా కొన్న స్థలమని చెప్పుకొచ్చారు. తాను వేరే వారి నుంచి పొలం కొనుక్కునే ముందే అందులో చిన్న బావి, పెంకుటిల్లు ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి అధికారం శాశ్వతం కాదన్నారు. తన దగ్గర దాపరికాలు ఏమి ఉండవని.. చంద్రబాబు, లోకేశ్ తన పొలం చూస్తాను అంటే రావాలని అన్నారు. తనను భయపెట్టాలని వారు అనుకుంటున్నారని.. గుంటూరులో తమ ఇంటికి కూడా నోటీసులు ఇస్తారేమోనని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## వర్సిటీల్లో 3,371 పోస్టుల భర్తీ: లోకేశ్

న్యాయస్థానం దాన్ని తప్పుబట్టిందని, దీంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని వివరించారు. ఈ నేపథ్యంలో న్యాయపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే ఏఏజీతో మూడుసార్లు సమావేశమై చర్చించామని, త్వరలోనే కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని రాజకీయ నియామకాలు జరిగాయని, దీనివల్ల విశ్వవిద్యాలయాల్లో సిబ్బంది అవసరాలపై స్పష్టత కొరవడిందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ గందరగోళాన్ని తొలగించేందుకు మ్యాన్‌పవర్ ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు వెయిటేజ్ ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, అయితే న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు న్యాయసలహా తీసుకుంటున్నామని అన్నారు. వయోపరిమితి సడలింపుపై కూడా ఇప్పటికే జీవోఎం ఏర్పాటు చేశామని, చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రికార్డు స్థాయిలో 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసి 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన విషయాన్ని లోకేశ్ గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక నియామకాలను కూడా అత్యంత సీరియస్‌గా తీసుకుంటున్నామని, ఉన్నత విద్యా రంగంలో సంస్కరణలు తీసుకొచ్చి కమిషనరేట్లను బలోపేతం చేస్తామని ఆయన ఉద్ఘాటించారు.

## విజయవాడలో జర్నలిస్టుల భారీ ర్యాలీ

ఆరోగ్య బీమా పథకానికి తోడుగా ప్రతి ఆరు నెలల కొకసారి జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షల సదుపాయం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యా సదుపాయం కల్పించాలని, జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, ఇతర సదుపాయాలపై అధ్యయనానికి మీడియా కమిషన్, వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు హైపవర్ కమిటీలను, మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కార్మిక బీమా సదుపాయం వర్తింపజేయాలని, రైల్వే ప్రయాణంలో రాయితీని కొనసాగించాలని కోరారు. ర్యాలీ అనంతరం కళాక్షేత్రంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సభలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు.

# శేషుగెడ్డపై ప్రమాదభరింతగా మారిన ప్రయాణం



**ఎలమంచిలి, పతాకం న్యూస్:** పట్టణంలో పాత జాతీయ రహదారిపై శేషుగెడ్డ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణం విషయంలో అధికారులు తీవ్రనిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాల్లో వేలాది మంది ప్రయాణిస్తుంటారు. శేషుగెడ్డ వద్ద రహదారి ఒకింత ఇరుకుగా వుంది. రెండు బస్సులు ఇక్కడ ఎదురైతే తప్పుకోవడం కష్టంగా వుంటుంది. ఒక బస్సు, ఎదురుగా కారు వచ్చినా ఇదే పరిస్థితి. క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సుమారు 40 ఏళ్ల క్రితం తక్కువ ఎత్తులో ఈ వంతెన నిర్మించడంతో వర్షాకాలంలో శేషుగెడ్డ ఉగ్రరూపం దాల్చి, జాతీయ రహదారిమీదుగా ప్రవహిస్తుంది. ఈ క్రమంలో ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో రహదారి అంచులను అంచనా వేయలేక వాహనదారులు గెడ్డలో పడిపోతున్నారు. కొన్నేళ్ల నుంచి ఈ పరిస్థితి వున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## బేతపూడి కేజీబీవీలో విద్యార్థినులకు కరాటే శిక్షణ

### ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో మెలకువలు నేర్పిన కోచ్ గెడ్డం నగేష్





**దేవరాపల్లి, పతాకం న్యూస్:** నేటి సమాజంలో అమ్మాయిలు ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవడం ఎంతో అవసరమని దేవరాపల్లి ఎస్సై వి. సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని బేతపూడి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు ఆత్మరక్షణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో కరాటే కోచ్ గెడ్డం నగేష్ విద్యార్థినులకు పలు ఆత్మరక్షణ మెలకువలను నేర్పించారు. విపత్కర పరిస్థితుల్లో ధైర్యంగా ఎదుర్కొనే ధైర్యసాహసాలు పెంపొందించుకోవాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్సై సూచించారు. శిక్షణ అనంతరం విద్యార్థినులు నేర్చుకున్న ఆత్మరక్షణ విన్యాసాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ఎస్ఓ కె.లక్ష్మి, పిఈటి కుమారి, ఉపాధ్యాయునిలు, మహిళా కానిస్టేబుల్, విద్యార్థినులు పాల్గొన్నారు. పై కార్యక్రమం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించడం జరిగింది.

## రేషన్ డీలర్ల సమస్యలను వెంటనే తక్షణమే పరిష్కంచాలి: వెంకన్న

**దేవరాపల్లి, పతాకం న్యూస్:** రేషన్ డిలర్లు సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న డిమాండ్ చేసారు. బుధవారం అయిన ఓప్రకటన విడుదల చేసిన అనంతరం మాట్లాడారు.ఒకప్పుడు రేషన్ డీలర్ అంటే సమాజంలో ఒక ప్రత్యేక మైన గుర్తింపు ఉండేదని.ఆర్థిక ఇబ్బందులు లేకుండా సొంత ఊరిలోనే ఉపాధిని పొందుతూ దర్జాగా జీవించే పరిస్థితులు ఉండేవని. ఒక గౌరవ ప్రదమైన సేవగాను భావించేవారని తెలిపారు గతంలో రేషన్ డీలర్లను స్థానిక ప్రజా ప్రతినిధులతో సమానంగా ప్రజలు గౌరవించే వారని తెలిపారు.ఇది ఒకప్పటి మాట అయితే ప్రస్తుతం వీటన్నింటికీ భిన్నంగా రేషన్ డీలర్ల బతుకులు అగమ్యగోచరంగా మారాయని అన్నారు. గతానికి భిన్నంగా రేషన్ డీలర్ల పరిస్థితి విగ్రహం పుష్టి నైవేద్యం నాస్తి అన్న చందంగా నేడు మారిందని ఆవేదన వ్యక్తంచేశారు.సొంత ఊరిలోనే ఉంటూ, కుటుంబ మంతా సంతోషంగా జీవించిన రేషన్ డీలర్లు బతుకులు ప్రస్తుతం చిన్న భిన్నమయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.జీరో ఆదాయంతో బతుకు జీవుడా అంటూ రేషన్ డీలర్ షిప్పను వదులు కోలేక మరో పని చేసు కోలేక ఊసురోమంటూ బతుకు తున్నారని తెలిపారు 10 ఏళ్ల క్రితం వరకు గౌరవ ప్రదంగా జీవించిన రేషన్ డీలర్లను ప్రభుత్వాలు ఒక దొంగలాగ ప్రజల్లో చూపించిందని తెలిపారు ప్రభుత్వం రేషన్ డీలర్లతో వెట్టి చాకిరీ చేయించు కుంటు ఆదాయ మార్గాలను చూపించ కుండా డీలర్ల కమిషన్ తో పని లేకుండా గౌరవ వేతనం చెల్లించాలని గగ్గోలు పెడుతున్న ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు ప్రభుత్వాలు మారిన ప్రతిసారి పౌరసరఫరాల వ్యవస్థ ప్రక్షాళన పేరుతో డీలర్ల ఆదాయ మార్గాలను నియంత్రించి, రేషన్ డీలర్లను దొంగలుగా చూపిస్తున్నారని తెలిపారు. పౌర సరఫరాల వ్యవస్థలో అసలు దొంగలు ఎవరో ప్రభుత్వాలకు తెలియదా అని ప్రశ్నించారు, కొన్ని దశాబ్దాలుగా రేషన్ షాపులను నమ్ము కుని బతుకుతున్న డీలర్ల బతుకులు గురించి,వారి ఆర్థిక పరిస్థితుల గురించి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో అన్యాయ మన్నారు డీలర్ షిప్పను వదులు కోలేక ఆదాయం లేక అప్పులు చేసుకొని బతుకుతున్నారని పేర్కొన్నారు గత ప్రభుత్వ హయాంలో ఇంటింటా రేషన్ సరఫరా వల్ల రేషన్ డీలర్లకు పని, ఆదాయము రెండు లెకుండా పోయాయని తెలిపారు కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే మా తలరాతలు మారుతాయని అని రేషన్ డీలర్లు ఎంతో ఆశపడ్డారని తెలిపారు.కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎండియు వ్యవస్థను రద్దు చేయడంతో గత వైభవం తిరిగి లభిస్తుందని రేషన్ డీలర్లంతా ఎంతో ఆశపడి సీఎం చంద్రబాబు చిత్ర పటానికి అభిషేకాలు కూడా చేశారని అయిన వారి ఆశలు అడి యాశలుగా మిగిలాయని తెలిపారు ఎండియు వ్యవస్థను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు రేషన్ డీలర్లకు సరుకులు సరఫరా బాధ్యతలను అప్పగించిందే తప్ప ఆదాయాన్ని పెంచ లేదన్నారు.ఎండియు వ్యవస్థ ఉండే టప్పుడు పని లేకపోయినా కొద్దిపాటి ఆదాయమైన వచ్చేదని ప్రస్తుతం సొంత ఖర్చులతో సహాయకునికి జీతం ఇచ్చుకుంటూ సరుకులను ప్రజలకు అందిజేస్తూ పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు గతంలో పౌరసర ఫరాల శాఖ ద్వారా రేషన్ బియ్యం, కిరోసన్, పంచదార ఇతర నిత్యావసర వస్తువులను డీలర్లు ప్రజలకు పంపిణీ చేసేవారని ప్రస్తుతం రేషన్ డిపోల్లో కేవలం బియ్యం, పంచదార మినహా మిగిలిన ఏ సరుకులు సరఫరా చేయడం లేదని అన్నారు. వివిధ రకాల సరుకులు సరఫరా చేసినందుకు రేషన్ డీలర్లకు పౌరసరఫరాల శాఖ నుండి కమిషన్ ద్వారా ఆదాయం లభించేదని.రేషన్ సరఫరాలో అవి నీతిని నియంత్రించడంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను డీలర్లు అందరూ స్వాగతి స్తున్నారని, అదే సమ యంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేలకు పైగా రేషన్ డీలర్ల బతుకులకు కనీస ఆదాయ మార్గాన్ని చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వ తీసుకోవాలని వెంకన్న డిమాండ్ చేశారు.

## మహిళలు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

**భీమిలి, పతాకం న్యూస్:** మహిళలు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని ఐసిడిఎస్ జిల్లా కోఆర్డినేటర్ సంతోషికుమారి విద్యార్థినులకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా జివిఎంసి మూడోవార్డు గొల్లలపాలెం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో విదార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు ధైర్యంగా ఉండడం వల్లే అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారన్నారు. ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార గోప్యత, రక్షణ, సోషల్ మీడియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సెంటర్ ఫర్ లిటరసీ ప్రతినిధులు వివరించారు.ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సరిత, రాజ్యలక్ష్మి, నాగమణి పోషకాహారం, ఆరోగ్యం, భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

## జూ పార్క్ వద్ద రోడ్డు ప్రమాదం..

## బొలెరోను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జూ పార్క్ సమీపంలో బుధవారం ఘోర ప్రమాదం తప్పింది. మధురవాడ వైపు వస్తున్న బొలెరో వాహనాన్ని వెనుక నుంచి ఓ ప్రైవేట్ బస్సు వేగంగా ఢీకొట్టింది.ఈ ధాటికి బొలెరో అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'మాడుగుల' రోడ్ల మరమ్మతుకు రూ.7.89 కోట్లు: ఎమ్మెల్యే బండారు



**కె.కోటపాడు, పతాకం న్యూస్:** గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ అండ్ బి రహదారుల మరమ్మతుల పనులకు జిల్లా వ్యాప్తంగా రూ. 20.66 కోట్లు మంజూరు చేయగా మాడుగుల నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ పరిధిలోని పలు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.7.89 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతు పనులకు మొత్తం రూ.20.66 కోట్లు మంజూరుకాగా, ఇందులో 38 శాతం నిధులు ఒక్క మాడుగుల నియోజకవర్గానికే కేటాయించడం గొప్ప విషయమని అన్నారు. చీడికాడ మండలం వరహాపురం నుంచి విజయరామరాజుపేట వరకు, చోడవరం నుంచి చీడికాడ వరకు 13.84 కిలోమీటర్ల రహదారికి రూ.3 కోట్లు, బీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట నుంచి చీడికాడ మండలం కోనాం వరకు 14.4 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.85 కోట్లు, మాడుగుల బ్రాంచ్ రోడ్డు 3.785 కిలోమీటర్లకు రూ.60 లక్షలు, సబ్బవరం నుంచి కె.కోటపాడు మీదుగా కొత్తవలస వరకు 5.8 కిలోమీటర్ల రోడ్డు రూ.40 లక్షలు మంజూరైనట్టు బండారు చెప్పారు. వడ్డాది-గౌటివాడ 8.4 కిలోమీటర్ల రోడ్డుకు రూ.40 లక్షలు, గవరవరం-కాశీపురం మధ్య 3.47 కిలోమీటర్ల రోడ్డు రూ.25 లక్షలు, రావికతం-కింతలి మధ్య 3.25 కిలోమీటర్ల రోడ్డుకు రూ.6 లక్షలు, మాడుగుల-దబ్బుగుంట- కేజే పురం మధ్య 4.5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.5 లక్షలు, దేవరాపల్లి మండలం పెదకోట-పినకోట మధ్య 4.5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.5 లక్షలు, పెదగోగాడ- తురువోలు మధ్య 7.486 కిలోమీటర్ల రోడ్డుకు రూ.5 లక్షలు, కింతలి-వమ్మిలి మధ్య మూడు కిలోమీటర్ల రోడ్డుకు రూ.5 లక్షలు, వడ్డాది- కింతలి మధ్య మూడు కిలోమీటర్ల రోడ్డుకు రూ.9 లక్షలు, చీడికాడ మండలం కోనాం- మంచాల మధ్య 7.6 కిలోమీటర్ల రోడ్డుకు రూ.5 లక్షలు, వెంకన్నపాలెం రోడ్డు నుంచి ఆనందపురం వరకు 3.9 కిలోమీటర్లకు రూ.5 లక్షలు మంజూరైనట్టు ఆయన తెలిపారు.

## మహిళా పోలీసులకు ఉచిత వైద్య శిబిరం




**విజయనగరం, పతాకం న్యూస్:** శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. బెలగాంలోని జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్‌లో హాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. మహిళా పోలీసులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహిం చారు. అవసరమైన మందులు అందించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళలకు వృత్తి బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలు ఉంటాయన్నారు. వారి ఆరోగ్యం పై శ్రద్ధ వహించడం ముఖ్యమన్నారు. అనంతరం వైద్యులు మహిళా పోలీసులకు సర్వికల్ బ్రెస్ట్ క్యాన్స ర్‌పై అవగాహన కల్పించారు. ఏఎస్పీ వెంకటేశ్వ రరావు, పార్వతీపురం ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, సీఐ వెంకటరావు, వైద్యులు రజనిప్రియ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## కాకరపాడు నుంచి రొంపులఘాట్ వరకు తరచూ ప్రమాదాలు..



**భీమిలి, పతాకం న్యూస్:** జాతీయ రహదారి 516-ఈ నిర్మాణంతో రాకపోకలు సజావుగా సాగుతున్నాయన్న ఆనందం ఒక వైపు, తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ఆందోళన మరో వైపు వాహనచోదకుల్లో నెలకొంది. జాతీయ రహదారిపై వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో పాటు పశువుల మందలు యథేచ్ఛగా తిరుగుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు నిర్మించిన జాతీయ రహదారి మండలంలో కాకరపాడు వద్ద ప్రారంభమై గూడెంకొత్తవీధి మండలం రొంపుల ఘాట్‌లో ఉన్న చిన కాట్రగెడ్డతో ముగుస్తుంది. సుమారు 20 కిలోమీటర్ల మేర ఉన్న ఈ జాతీయ రహదారిలో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతూనే ఉంది. 2024 సెప్టెంబరు 29న రావణాపల్లి సమీపంలో రోడ్డుపై తిష్ఠ వేసిన పశువుల మందను తప్పించే క్రమంలో కారు రాంగ్‌రూట్‌లో వెళ్లి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రాజేంద్రపాలేనికి చెందిన అంబటి అప్పన్న, యాదగిరి రాజబాబు మృతి చెందారు. అలాగే 2025 సెప్టెంబరులో శింగవరానికి చెందిన పాంగి అఖిల్.. పిట్టచలం సమీపంలో అతివేగంతో ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి మృతి చెందాడు. 2026 జనవరి 17న రామరాజుపాలెం వద్ద అతివేగంగా ద్విచక్ర వాహనంపై వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై సాగిన రాంబాబు మృతి చెందాడు. 2026 ఫిబ్రవరి 26న ద్విచక్ర వాహనంపై వెళుతున్న పాస్టరు చింతలపూడి వద్ద పశువుల మందను ఢీకొని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 1న ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ రామరాజుపాలెం టోల్‌గేటు వద్ద అదుపుతప్పి విద్యుతు స్తంభాన్ని ఢీకొని వలసంపేటకు చెందిన చదల గణేశ్ దుర్మరణం చెందాడు. అదే రోజు చింతాలమ్మ ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రెవెన్యూ ఉద్యోగితో పాటు ఆయన కుమారుడు గాయాలపాలై చికిత్స పొందుతున్నారు. ఇలా ఈ జాతీయ రహదారిపై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. ఇక శరభన్నపాలెం సమీప నడింపాలెం నుంచి కాకరపాడు వరకు గల గ్రామాల రైతులు తమ పశువులను రోడ్డుపై విడిచిపెడుతున్నారు. దీంతో పశువులు పగటి పూట మేసి రాత్రి వేళ జాతీయ రహదారిపై సేదతీరుతున్నాయి. రాత్రి వేళ వీటిని గమనించని వాహనచోదకులు వేగంగా వస్తూ వాటిని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జాతీయ రహదారిపై వాహనాల వేగ నియంత్రణతో పాటు పశువుల మంద రోడ్డుపై తిరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## పాడేరు, అరకులోయలో శరవేగంగా సాగుతున్న అన్న క్యాంటీన్ల నిర్మాణాలు



**పాడేరు, పతాకం న్యూస్:** పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో అన్న క్యాంటీన్ల భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేవలం రూ.5లకే మన్యంలోని పేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. పాడేరులో ఎన్‌టీఆర్ రైతు బజార్‌లో, అరకులోయ టౌన్‌కు సమీపంలో అన్న క్యాంటీన్ల భవనాలను నిర్మిస్తున్నారు. ఒక్కో క్యాంటీన్ నిర్మాణానికి రూ.51 లక్షలు చొప్పున కేటాయించారు. మరో నెల రోజుల్లో వాటిని అందుబాటులోకి తీసుకుని రావాలనే లక్ష్యంతో నిర్మాణ పనులను వేగంగా చేపడుతున్నారు. ప్రస్తుతం గోడలు, శ్లాబుతో పాటు ప్లాస్టింగ్ పనులు తుదిదశకు చేరడంతో విద్యుత్ వైరింగ్ పనులను చేపడుతున్నారు. తర్వాత ఎలివేషన్, లోపల ఫర్నిచర్ పనులు చేపట్టి మరో నెల రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనతో ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయడం వలన ప్రధానంగా పేదలకు, ఇతర ప్రాంతాల నుంచి పాడేరు, అరకులోయ ప్రాంతాలకు వచ్చే మారుమూల ప్రాంతాల గిరిజనులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. కేవలం రూ.5లకే రుచికర, నాణ్యమైన భోజనం అందుతుంది.

## ఉత్సాహంగా విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీలను సంస్థ సిఎండి డాక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి ప్రారంభించారు. రైల్వే గ్రౌండ్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న విశాఖపట్నం సర్కిల్ ఇంటర్ డివిజన్ స్పోర్ట్స్ మీట్‌ను బెలూన్లు, పావురాలను ఎగురవేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని డివిజన్ల నుంచి 300 మంది విద్యుత్ ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొంటున్నారు. పురుషుల విభాగంలో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ పోటీలు జరుగుతుండగా, మహిళల విభాగంలో టగ్ ఆఫ్ వార్, షటిల్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ వంటి క్రీడలు నిర్వహిస్తున్నారు. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సిఎండి పృథ్వీతేజ్ మాట్లాడుతూ ఉద్యోగులకు క్రీడలు ఎంతగానో అవసరమని, తరచూ క్రీడల్లో పాల్గొంటే విధుల్లో మరింత ఉత్సాహం, చురుకుదనం పెరుగుతుందన్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా అత్యంత ముఖ్యమన్నారు. క్రీడల ద్వారా పట్టుదల, క్రమశిక్షణ, పోటీతత్వం వంటి లక్షణాలు అలవడతాయన్నారు. అనంతరం షటిల్ బ్యాడ్మింటన్‌లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ టివి. సూర్యప్రకాష్ మాట్లాడుతూ నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉండే ఉద్యోగులకు మానసిక, శారీరక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జి.శ్యాంబాబు, జనరల్ సెక్రటరీ పోలాకి శ్రీనివాసరావు, సెక్రటరీ ఎ.పార్థసారధి, ఇఇలు ఎం.ధర్మరాజు, బి.కె.నాయుడు, బి. సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

## ఇళ్లలో పేలుడు పదార్థాలుంటే జైలుకే..



**పొందూరు, పతాకం న్యూస్:** క్వారీలో వినియోగించే ప్రమాదకర పేలుడు పదార్థాలను ఇళ్లలో నిల్వచేస్తే బాధ్యులు జైలుకు వెళ్లక తప్పదని డీఎస్పీ సీహెచ్ వివేకానంద హెచ్చరించారు. కృష్ణా పురం ఆనందాశ్రమంలో క్వారీ నిర్వాహకులు, కార్మికులు, పేలుడు పదార్థాల విక్రయ దారులతో సమావేశం నిర్వహించారు. పేలుడు పద ర్థాలను క్వారీ కార్మికుల ఇంటికే సరఫరా చేస్తు న్నారని, వారు ఇళ్లలో ఉంచుతున్నారని సమాచారం ఉందని, పట్టుబడితే కఠిన చర్యలు తప్ప వని హెచ్చరించారు. నిబంధనల మేరకు పేలుడు పదార్థాలను విక్రయించాలని అన్నారు. సమావేశం లో తహసీల్దార్ ఆర్.వెంకటేష్, సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మండలంలో ఉన్న శాశ్వత బాణసంచా గోడౌన్లను పోలీసులు తనిఖీ చేశారు. కాకినాడ జిల్లా వేట్లపాటెంలో జరిగిన పేలుడు నేపథ్యంలో బి.కంచరాం, పిల్లలవలస గ్రామాల్లో గోడౌన్‌లను పరిశీలించారు. ప్రమాదకర పేలు డు పదార్థాలున్నా, అనుమతులకు మించి నిలు వ చేసినా లైసెన్స్ రద్దు చేస్తామని ఆమదాల వలస సీఐ పి.సత్యనారాయణ హెచ్చరించారు. ఎస్ఐ వి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## అధిక శబ్దంతో వినికిడి సమస్యలు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ఒక స్థాయికి మించిన శబ్దాల కారణంగా వినికిడి సమస్యలు వచ్చే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిమితికి మించిన శబ్దాలు, ధ్వనులతో చెవులు దెబ్బతింటాయన్నారు. హెడ్‌సెట్స్, ఇయర్ బడ్స్, డీజే సౌండ్స్, శృతి మించిన హారన్స్‌తో వినికిడి సమస్యలు వస్తున్నాయని వెల్లడించారు. శబ్ద స్థాయి 80 డెసిబెల్స్‌కు మించకుండా చూసుకోవాలని సూచించారు. కొన్ని హెచ్చరిక సంకేతాలతో వినికిడి సమస్యలను గుర్తించొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీపీవో టి.జగన్మోహన్‌రావు, డీఐవో వై.విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## 30 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు.. నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్: అనిత

(మొదటిపేజీ తరువాయి)

అగ్నిమాపక పరికరాలు లేని భవనాలపై జరిమానాలను భారీగా పెంచుతున్నట్లు మంత్రి తెలిపారు. నిర్దేశిత కాలపరిమితి ప్రకారం అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, అగ్నిమాపక పరికరాల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇచ్చేలా చట్టంలో సవరణ చేసినట్లు తెలిపారు. వాణిజ్య, పారిశ్రామిక, నివాస భవనాలకు ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరి చేస్తున్నామన్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో అత్యవసర మార్గాలు, అగ్నిమాపక పరికరాలతో పాటు తగిన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి అనిత పేర్కొన్నారు. సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వడం, ఆధునిక రక్షణ విధానాలపై అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు 21 నుంచి 30 రోజుల్లో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భవన ప్రాంగణాన్ని సీజ్ చేసే చర్యలు తీసుకుంటామని మంత్రి అనిత హెచ్చరించారు. ఈ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

# ఏపీలో టీనేజ్ ప్రెగ్నెన్సీలు పెరుగుతున్నాయి: శైలజ



**విజయవాడ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో టీనేజ్ ప్రెగ్నెన్సీలు అధికమవుతున్నాయని ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జాబితాలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడో స్థానంలో ఉందని తెలిపారు. బుధవారం విజయవాడలో రాయపాటి శైలజ విలేకర్లతో మాట్లాడుతూ.. విశాఖపట్నం మినహా అన్ని జిల్లాల్లో టీనేజ్ ప్రెగ్నెన్సీలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ అంశంపై అన్ని విభాగాలతో కలిసి రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేశామని వివరించారు.

ఒక్కొక్క జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఇవి పల్నాడు, కర్నూలు జిల్లాల్లో జరుగుతున్నాయని వివరించారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్యం మీద పిల్లలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విలేజ్ డెవలప్‌మెంట్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు చదువుకోకపోవడం వల్ల కూడా టీనేజ్ ప్రెగ్నెన్సీలు పెరిగే అవకాశం ఉందని మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో దీనిపై తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పిస్తున్నామన్నారు. సోషల్ మీడియా ద్వారా సైతం టీనేజర్లు ఆకర్షణకు గురవుతున్నారని తెలిపారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలు పెరిగిపోవడానికి ఇదీ ఓ కారణమని రాయపాటి శైలజ ఆందోళన వ్యక్తం చేశారు.

## శిథిలావస్థలో గిరిజన ప్రాథమిక పాఠశాలలు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** టెక్కలి మండల చిన్నాకేదారిలోని ప్రభుత్వ పాఠశాలలో 14 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. గత 30 ఏళ్ల కిందట నిర్మించిన ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని బీటలువారింది. విద్యాశాఖ అధికారుల సూచన మేరకు ఈ భవనాన్ని ఖాళీ చేసి.. అర్థాంతరంగా నిర్మించి వదిలేసిన అంగన్‌వాడీ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. మట్టి నేలపైనే చదువులు సాగిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఉపాధ్యాయుడు దండాశి తెలిపారు. మెళియాపుట్టి మండలం పరశురాంపురంలోని ప్రభుత్వ పాఠశాలలో 12 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. వైసీపీ పాలనలో అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ప్రస్తుతం పాత సచివాలయ భవనంలో బోధన సాగిస్తున్నారు. గిరిజన ప్రాథమిక పాఠశాలలకు(జీపీఎస్) సమస్యలు వెంటాడుతున్నాయి. చాలా పాఠశాలలు శిథిలావస్థలకు చేరుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 100 పాఠశాలలు ఉండగా, సుమారు 1,558 మంది విద్యార్థులు చదువుతున్నారు. పది మంది విద్యార్థులు కన్నా తక్కువ ఉన్న పాఠశాలలను గత వైసీపీ ప్రభుత్వం మూసేసింది. సమీప పాఠశాలల్లో విలీనం చేసింది. దీంతో గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక స్థాయిలో చదువుకునే అవకాశం లేక డ్రాపౌట్స్ పెరుగుతున్నారు. కొంతమంది సమీప పాఠశాలలకు ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారు. కాగా.. ఆ పాఠశాలల్లో కూడా మౌలిక సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. 30 ఏళ్ల కిందట టీడీపీ ప్రభుత్వ హయాంలో అధికంగా జీపీఎస్ పాఠశాలలకు నిధులు మంజూరు చేసి భవనాలు నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం మాత్రం ఈ పాఠశాలలకు కనీసం మరమ్మతులకు కూడా నిధులు కేటాయించలేదు. దీంతో చాలా భవనాలు శిథిలావస్థకు చేరుకుని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో గచ్చులు పాడైపోవడంతో టార్పాలిన్లు, చాపలు తెచ్చి కూర్చొంటున్నారు. మరికొన్ని పాఠశాలల్లో పైన పెచ్చులూడిపోవడంతో బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పాఠశాలలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## ఉపాధ్యాయుల బకాయిలు విడుదల చేయాలి: ఏపీటీఎఫ్



**విజయనగరం, పతాకం న్యూస్:** ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక పరమైన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయ కులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి.. నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ 12వ ఆర్థిక సంఘాన్ని వెంటనే నియమించాలని... 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులను భోదనకే పరిమతం చేయాలని డిమాండ్ చేశారు. హైస్కూల్ ప్లస్‌లో ఖాళీలు భర్తీ చేయాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని కోరారు. ఎంఎస్‌టీ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయసును 60 సంవత్సరాల నుంచి 62 కు పెంచాలని కోరారు. వీరి నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఏపీ ఎన్‌జీవో అధ్యక్షులు సురేష్ మద్దతు తెలిపారు. సంఘ నాయకులు బలరాం నాయుడు, పైడిరాజు, ఈశ్వరరావు, శ్రీధర్ బాబు, సదాశివరావు, కృష్ణ, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ నిక్షేపాల కోసమే ఇరాన్‌పై యుద్ధం

### విశాఖలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఇరాన్‌లో ఉన్న ఆయిల్ నిక్షేపాల కోసమే అమెరికా, ఇజ్రాయిల్ ఏకపక్షంగా దాడులకు తెగబడ్డాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జె.వి సత్యనారాయణమూర్తి ఆరోపించారు. ఇరాన్‌పై చేస్తున్న దాడులను అమెరికా, ఇజ్రాయెల్ ఆపాలని డిమాండు చేస్తూ సిపిఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సాయంత్రం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకదేశంపై మరో దేశం దాడి చేయడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనన్నారు. ట్రంప్, నెతన్యాహుల విధానాలే ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ఈ దాడిలో వందలాది మంది చిన్నారులు, విద్యార్థులు, అమాయక పౌరుల ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. అయిల్ కోసమే ఇటీవల వెనెజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్యను అమెరికా కిడ్నాప్ చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఇరాన్‌పై దాడికి తెగబడిందన్నారు. ప్రపంచం అల్లకల్లోలమవుతున్నా, ఉపాధి కోసం కోట్ల మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో ఉన్నా, ప్రధాని మోడీ కనీసం యుద్ధం ఆపాలని అమెరికాకు సూచన చేయకపోవడం దారుణమన్నారు. ఇది భారత విదేశాంగ విధానానికి వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అత్తిలి విమల, ఎస్‌కె.రహిమాన్, పి.చంద్రశేఖర్, సిఎన్.క్షేత్రపాల్, ఎం.మన్మథరావు, వనజాక్షి, ఎంఎ.బేగం, ఎన్.నాగభూషణం, దేవుడమ్మ, బి.పుష్పలత, సిహెచ్.కాసుబాబు పాల్గొన్నారు. అనకాపల్లి : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా దాడులు చేయడం దుర్మార్గమని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) అనకాపల్లి జిల్లా సమితి పేర్కొంది. ఈ మేరకు మంగళవారం శ్రామిక సదనంలో దావూద్ ఆలీ అధ్యక్షతన ప్రపంచం శాంతిని కోరుతూ యుద్ధంలో కన్నుమూసిన మానవాళికి నివాళులర్పించారు. అనంతరం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఇస్కఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎంఎ.మాధవరావు మాట్లాడుతూ ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు చేసి ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఆలి ఖొమైనీ హతమార్చాయని తెలిపారు. అమెరికా అనుసరించే సామ్రాజ్యవాద, దురాక్రమణ పూరిత చర్యలతో ప్రపంచంలో శాంతి లేకుండా పోతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇస్కఫ్ జిల్లా నేతలు విల్లూరి పైడారావు, దాడి శివరాం, మళ్ల చక్రవర్తి, ఎంఆర్ఎస్ ప్రకాష్, బొడ్డేడ అప్పారావు, లాయర్ సాయి లక్ష్మణ్, వెంకటేశ్వరరావు, భద్రం, శంకర్రావు, వి ఎస్‌పి సత్యనారాయణ, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి నోచుకోని పోలీస్ స్టేషన్ భవనం



**మందస, పతాకం న్యూస్:** మందసలో మోడల్ పోలీస్‌స్టేషన్ భవనం పనులు పూర్తయినా మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోవడంలేదు. దీంతో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండి విషసర్పాలకు నిలయాలుగా మారుతోంది. తొలుత మోడల్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లాలో మందసను ఎంపికచేశారు. దీంతో మందస గాయత్రీ నగర్ సమీపంలో పాత పోలీస్ క్వార్టర్స్ స్థలంలో 1.2 ఎకరాల్లో మూడేళ్ల కిందట రూ.2.15 కోట్లతో పోలీస్ స్టేషన్ భవనం, నీటి ట్యాంకు నిర్మించారు. పనులు పూర్తయినా వైసీపీ ప్రభుత్వం ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రారంభానికి సంబంధిత అధికారులు చొరవచూపడంలేదు. అయితే తొలు త స్థలం ఎంపికలో వివాదం చోటుచేసుకున్నా చివరకు పోలీస్‌శాఖకు చెందిన స్థలంలో అత్యాధునిక సదుపాయా లు, అన్నిహంగులు, టెక్నాలజీ ఉపయోగించి సర్వాంగసుందరంగా నిర్మాణాలు పూర్తిచేశారు. కాగా నిర్మాణం పూర్తయినా ప్రజాప్రతినిధుల స్పందన లేకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడంలేదు. అధికారులు ప్రజా ప్రతి నిధులు స్పందించి భవనం ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## గిడ్డంగుల్లో బాణసంచా భారీ నిల్వలు



**గుంటూరు, పతాకం న్యూస్:** కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనలతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. గతంలో దీపావళికి మాత్రమే వినియోగించే బాణసంచా విక్రయాలు కొన్నేళ్లుగా నిత్యావసర వస్తువుల మాదిరిగా విక్రయాలు నిత్యకృత్యంగా మారిపోయాయి. వివాహాది శుభకార్యాలతో పాటు ఎవరైనా మృతి చెందినా, రాజకీయ పార్టీల ఊరేగింపులు, వివిధ పండలు, ఆధ్యాత్మిక ర్యాలీలు, పుట్టిన రోజు, సినిమా ఫంక్షన్లు, పరీక్షల ఫలితాలు వచ్చినపుడు విద్యా సంస్థల ఎదుట పెద్ద ఎత్తున బాణసంచా కాల్చడం పరిపాటైంది. పెద్ద శబ్దంతో కూడిన పేలుడు పదార్థాలే ఎక్కువగా వినియోగించడం, ధ్వని కాలుష్యంతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నారు. ప్రజలకు నిద్రాభంగం కల్గించే రీతిలో అర్ధరాత్రి 12 గంటలకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించి భారీ శబ్దాలతో కూడిన టాపాసులను కాల్చడం కొంత మందికి సరదాగా మారింది. అయితే గతంలో నిల్వ ఉన్న గిడ్డంగులు అన్ని ఊరికి దూరంగా జన సంచారానికి దూరంగా ఉండేవి. ఇప్పుడు ఊరి మధ్యలో జనసమ్మర్ధం కలిగిన ప్రాంతాల్లోనే గిడ్డంగులు నిర్వహిస్తున్నారు. విక్రయ దుకాణాలు ఎక్కువగా లాలాపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఎక్కువగా ఉన్నాయి. గుంటూరు, తెనాలి, నరసరావుపేట, పొన్నూరు, మంగళగిరి, వినుకొండ, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలకలూరిపేట తదితర పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో కూడా దుకాణాలు నిర్వహిస్తున్నారు. నిల్వకేంద్రాలు కూడా ఇళ్ల మధ్మనే ఉంటున్నాయి. పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు చూసిచూడనట్టు వ్యవహిరిస్తున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావుడిగా తనిఖీలు చేయడం తరువాత అంతా గప్‌చుప్ అయిపోతోంది. జిల్లా మొత్తం మీద ఏడాదికి రూ.500 కోట్ల వ్యాపారం జరుగుతుందని తెలుస్తోంది. తమిళనాడులోని శివకాశీ నుంచి ఎక్కువగా బాణసంచా సామగ్రిని దిగుమతి చేసుకుంటున్నారు. కొన్ని వస్తువులు స్థానికంగా తయారు చేస్తుంటారని వ్యాపారులు చెబుతున్నారు. ఈ వ్యాపారంపై అధికార యంత్రాంగం తగిన తనిఖీలు, భద్రతా చర్యలు చేపట్టాల్సి ఉంది. నిబంధనలు గట్టిగా ఉన్నా అమలులోనే పర్యవేక్షణ లేదు. వేట్లపాలెం ఘటన నేపథ్యంలో మంగళవారం గుంటూరులో పోలీసు అధికారులు బాణసంచా దుకాణాల్లో తనిఖీలు చేసి అగ్ని భద్రతా ప్రమాణాలు, చట్టబద్ధ అనుమతులు, నిల్వ పరిమితులు భద్రతా ఏర్పాట్లను వివరాలను పరిశీలించారు. అగ్ని ప్రమాద నివారణకు అవసరమైన చర్యలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు.

## కల్తీపాల ఘటనలో మరొకరు మృతి.. 8కి చేరిన మృతుల సంఖ్య



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనలో మరొకరు మృతి చెందారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జి.సూర్యారావు (81) పరిస్థితి విషమించి ప్రాణాలు విడిచారు. దీంతో మృతుల సంఖ్య 8కి చేరింది. చౌడేశ్వర్ నగర్‌కు చెందిన జి.సూర్యా రావు ఫిబ్రవరి 17న కిడ్నీ సంబంధిత సమస్యలతో కిమ్స్ ఆస్పత్రిలో చేరారు. వీరి కుటుంబం కూడా పాల వ్యాపారి గణేష్ వద్దనే పాలు పోయించుకుంటోంది. గత నెల 16న ఈ పాలను తాగినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అదే రోజు యూరిన్ సమస్యతో ఇబ్బంది పడటంతో కుటుంబ సభ్యులు ఆయనను కిమ్స్‌కు తరలించారు. అప్పటి నుంచి వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తూ డయాలసిస్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 13 మంది చికిత్స పొందుతుండగా వీరిలో పది మంది వెంటిలేటర్‌పై, మరో ముగ్గురికి డయాలసిస్ చికిత్స అందిస్తున్నారు.

## మైనర్ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు



**గుంటూరు, పతాకం న్యూస్:** మైనర్ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని, అందుకు సహకరించిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను ఇన్‌ఛార్జి సౌత్ డిఎస్‌పి బీవీ మధుసూదన్‌రావు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఓబులనాయుడుపాలెంలో నివాసం ఉండే బాధితురాలు గుంటూరులోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతుండగా స్కూల్ వెళ్లివచ్చే క్రమంలో ఓబులనాడుపాలేనికే చెందిన 35 ఏళ్ల మాదల నాగరాజు 7 నెలలుగా వెంబడిస్తూ డబ్బులు, బట్టలు, బంగారం, చాక్లెట్ల పేరుతో ప్రలోభపెట్టి శారీరక సంబంధానికి ఒత్తిడి చేశాడు. విద్యార్థిని నిరాకరించడంతో ఇదే గ్రామానికి చెందిన చిట్టేటి వరలక్ష్మీ అనే మహిళ ద్వారా మధ్యవర్తిగా ఉపయోగించి మాయమాటలతో ప్రలోభపెట్టారు. విద్యార్థినిని వరలక్ష్మీ తన ఇంటికి వచ్చేలా చేసి లైంగికదాడికి పాల్పడ్డంతోపాటు విషయం బయటపెడితే చంపేస్తానని బెదిరించాడు. ఆ తర్వాత కూడా వరలక్ష్మీ ప్రోత్సాహంతో పలుమార్లు లైంగికదాడి చేశాడు. ఆ సందర్భంలో తీసిన ఫొటోలు, వీడియోలు ఉన్నాయని, వాటిని బయటపెడతానని బెదిరిస్తూ మరిన్నిసార్లు లైంగిక దాడులకు పాల్పడ్డాడు. దీనిపై భాదితురాలి తల్లి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కేసును డీఎస్పీ పర్యవేక్షణలో సిఐ వంశీధర్ దర్యాప్తు చేస్తున్నారు.

# ఆగని భీకర పోరు.. దాడులు.. ప్రతీదాడులతో మరణ కాండ





ఇరాన్: అమెరికా సామ్రాజ్యవాద కరాళనృత్యం 787 మంది ప్రాణాలను బలిగొంది. అమెరికా-ఇజ్రాయిల్ సేనలు, ఇరాన్ దళాల మధ్య భీకర పోరు కొనసాగుతుంది. మరోవైపు హిజ్బొల్లా కూడా రంగంలోకి దిగడంతో మధ్యప్రాచ్యంలో భయానక వాతావరణం కన్పిస్తోంది. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని హిజ్బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ మంగళవారం పెద్ద ఎత్తున దాడులకు తెగబడింది. అనేక నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. బీరుట్ దక్షిణ శివారు ప్రాంతంలో ఉన్న హిజ్బొల్లా టీవీ, రేడియో స్టేషన్ భవనాలపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో తీవ్ర నష్టం వాటిల్లింది. హెజ్బొల్లాకు చెందిన అల్-మనార్ టీవీ ప్రసారాలు సుమారు గంట పాటు నిలిచిపోయాయి. శివారు ప్రాంతాలను ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. అక్కడి ప్రజలను ఖాళీ చేయాలంటూ హుకుం జారీ చేసింది. మరోవైపు ఇరాన్‌లోని ఓ ప్రాథమిక పాఠశాలపై అమెరికా-ఇజ్రాయిల్ సేనలు జరిపిన వైమానిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన 160 మంది అమాయక బాలికలను సాముహికంగా ఖననం చేశారు. వైమానిక దాడిలో బాలికల శరీరాలు ఛిద్రమై పోయాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి చెందిన ఏడు ఎమిరేట్స్‌లో ఒకటైన ఫుజైరాలోని చమురు కేంద్రం నుంచి అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. అంతకుముందు చమురు కేంద్రం పైకి దూసుకొచ్చిన డ్రోన్‌ను భద్రతా దళాలు అడ్డుకున్నాయి. అయినప్ప టికీ శకలాలు చమురు పరిశ్రమ జోన్‌లో పడడంతో మంటలు వ్యాపించాయి. అమెరికా దాడిలో ఇరాన్‌లోని భూగర్భ నతంజ్ ఫ్యూయల్ ఎన్‌రిచ్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఈపీ) ప్రవేశ భవనాలు కొంతమేర దెబ్బతిన్నాయని ఐరాసకు చెందిన ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ తెలిపింది. అయితే అణుధార్మిక పరిణామాలు సంభవించే ప్రమాదం ఏమీ లేదని చెప్పింది. ఇరాన్ సైనిక, ప్రభుత్వ కార్యాలయాలే లక్ష్యంగా అమెరికా వైమానిక దాడులు జరపగా ఇరాన్ కూడా ప్రతీకార దాడులు జరిపింది. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై పెద్ద ఎత్తున దాడులు చేసింది. దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో సంక్షోభం తీవ్రతరమైంది. భూతల దాడులు జరిపే అవకాశాన్ని తోసిపుచ్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. దీర్ఘకాల పోరుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇజ్రాయిల్ మాత్రం భూతల దాడులు ఆచరణ సాధ్యం కావని చెప్పింది. మరోవైపు ఒత్తిడికి తలవంచబోమని, అయితే చర్చలకు సిద్ధంగానే ఉన్నామని ఇరాన్ తెలిపింది. హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నామని ప్రకటించింది. వ్యూహాత్మక సముద్ర మార్గంలో ప్రయాణించేందుకు ఏ నౌక అయినా ప్రయత్నిస్తే పేల్చివేస్తామని హెచ్చరించింది.

అమెరికా-ఇజ్రాయిల్ దళాలు జరుపుతున్న దాడులలో మరణించిన వారి సంఖ్య 787కు చేరింది. కెర్మన్ రాష్ట్రంలో జరిగిన దాడిలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన 13 మంది చనిపోయారు. దాడులతో భీతిల్లుతున్న ఇరాన్ ప్రజలను తాజాగా భూ ప్రకంపనలు వణికించాయి. దక్షిణ ప్రాంతంలోని గెరాష్ సమీపంలో రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రతతో భూమి కంపించింది. ఇజ్రాయిల్ సేనలు ముందుకు సాగుతుండడంతో సరిహద్దుల వద్ద లెబనాన్ ప్రభుత్వం దళాల మోహరింపును పెంచింది. లెబనాన్‌లో మరిన్ని స్థావరాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సైన్యానికి అధికారం ఇచ్చారు. సరిహద్దున ఉన్న ప్రజలపై కాల్పులు జరగకుండా నివారించడానికే ఈ చర్య తీసుకున్నామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ చెప్పారు. లెబనాన్‌లోని హెజ్బొల్లా లక్ష్యాలపై ఇజ్రాయిల్ సేనలు విరుచుకుపడుతున్నాయి. ఇదిలావుండగా ఫ్రాన్స్‌లోని అక్రోటిరిలో ఉన్న బ్రిటీష్ రాయల్ ఎయిర్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) స్థావరంపై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. దీంతో సైప్రస్‌కు క్షిపణి, డ్రోన్ నిరోధక వ్యవస్థలను పంపాలని ఫ్రాన్స్ యోచిస్తోంది. ఒమన్‌లోని ఓ ఓడరేవులో ఉన్న ఇంధన ట్యాంకులపై కూడా ఇరాన్ డ్రోన్లను ప్రయోగించింది. ఖతార్‌లోని ఇజ్రాయిల్, అమెరికా సైనిక స్థావరంపై కూడా ఇరాన్ దాడులు చేసింది. త్రివిధ దళాలకు చెందిన విధ్వంసక డ్రోన్లు ఆక్రమిత ప్రాంతాలలోని ఇజ్రాయిల్ సైనిక ప్రాంతాలను, అల్-ఉదెయిద్‌లోని అమెరికా దళాల స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయని ఇరాన్ సైన్యం తెలిపింది. ఇరాన్ అధ్యక్ష కార్యాలయాన్ని, సెక్యూరిటీ కౌన్సిల్ భవనాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని ఇజ్రాయిల్ చెప్పింది. వాటిపై భారీగా ఆయుధాలు ప్రయోగించి ధ్వంసం చేశామని తెలియజేసింది. సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఉన్న అమెరికా రాయబార కార్యాలయంపై కూడా ఇరాన్ రెండు డ్రోన్లతో దాడి చేసింది. ఈ ఘటనలో ఆ భవనం స్వల్పంగా దెబ్బతిన్నది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) తెలిపింది. ఆ ప్రాంతంలో వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడిందని, ఇంధన ధరలు పెరుగుతున్నాయని పేర్కొంది. పశ్చిమాసియాపై కానీ, ప్రపంచంపై కానీ పడే ఆర్థిక ప్రభావాన్ని ఇప్పుడే అంచనా వేయలేమని అంటూ ఘర్షణలు ఎంత కాలం కొనసాగుతాయనే విషయంపై అది ఆధారపడి ఉంటుందని చెప్పింది.

# 20 శాతమే 'శనగలు' కొనుగోళ్లు.. మిగతాది దళారులకు అమ్ముకునే దుస్థితి



**ఒంగోలు, పతాకం న్యూస్:** మార్క్‌ఫెడ్ ద్వారా శనగలు కొనుగోలు చేసి.. రైతులను ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు. పండిన పంటలో 20 శాతం లోపే మాత్రమే మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు చేస్తోంది. మిగతా 80 శాతం పంటను వ్యాపారులకు, దళారులకు అమ్ముకోవాల్సి దుస్థితి. కొనుగోళ్ల లక్ష్యాలు చూశాక రైతుల్లో ఆందోళన తప్పడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది 8,12,500 లక్షల ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగు చేశారు. 37 లక్షల క్వింటాళ్లు దిగుబడి రావచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో నాలుగో వంత పంట ఒక్క ప్రకాశం జిల్లాలోనే సాగవుతుంది. ఈ ఏడాది మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోళ్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో మార్క్‌ఫెడ్ కొనుగోలు లక్ష్యం 9.45 లక్షల క్వింటాళ్లుగా నిర్ణయించారు. ఒక్క ప్రకాశం జిల్లాలో ఈ ఏడాది సుమారు ఎనిమిది లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తే మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 1.50 లక్షల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయనున్నారు. కేంద్రం నిబంధనల మేరకు 25 శాతం పంటను కొనుగోలు చేయాలి. కానీ రాష్ట్రంలో మాత్రం 20 శాతం లోపే కొనుగోళ్లు చేస్తున్నారు. ఎకరా శనగ పంటకు పెట్టుబడి రూ.45 వేలు అవుతోంది. వాతావరణం అనుకూలిస్తే సరాసరిన ఏడు క్వింటాళ్లు వరకు దిగుబడి వస్తుంది. ఒక క్వింటాలుకు రూ.5,875 ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. ఈ లెక్కన ఎకరాకు రూ.3,875 వరకు రైతు నష్టపోతున్నారు. కౌలు రైతుల విషయానికి వస్తే ఈ నష్టం మరింత పెరుగుతోంది. వాస్తవంగా పరిశీలిస్తే 60 శాతం మంది కౌలు రైతులే శనగ పంటను సాగు చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయగా మిగిలిన 80 శాతం పంటను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక క్వింటాలు రూ.ఐదు వేలకు మించి కొనడం లేదు. ప్రైవేటు వ్యాపారులు ధరలు ఇవ్వనందునే గతేడాది పండించిన పంట ప్రస్తుతం నాలుగు లక్షల క్వింటాళ్లు కోల్ట్‌స్టోరేజీల్లో మూలుగుతున్నాయి. ఇప్పుడూ నిల్వ చేసుకోవాలా? లేక తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవాలా? అనే సందిగ్ధంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. గతేడాది శనగ పంటకు బీమా సౌకర్యం కల్పించారు. రైతులు తమ వాటా చెల్లించినప్పటికీ ప్రభుత్వం నుంచి చెల్లించాల్సిన వాటా కట్టనందున పంట నష్టపోయిన రైతులకు పరిహారం దక్కలేదు.

శనగ పంటను వీలైంత మేరకు ఎక్కువ శాతం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రైతు సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు కోరారు. కేంద్రం నిబంధన ప్రకారం దిగుబడిలో 25 శాతం కొనాలని ఉండగా రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ 15 నుంచి 20 శాతం లోపే కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించడం సరికాదన్నారు. శగన రైతుల విషయంలో ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారానికి కొనుగోళ్లకూ పొంతన లేదన్నారు.

## గుర్రంపాలెం సర్పంచ్ భర్త హల్‌చల్

**కాకినాడ, పతాకం న్యూస్:** : అధికారుల యంత్రాంగం వస్తేనే తాను కిందికి వస్తానంటూ ... బుధవారం జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామ సర్పంచ్ భర్త చీపురుపల్లి రాఘవ సచివాలయం పైకి ఎక్కి హల్చల్ చేశారు. గ్రామంలోని సమస్యలు, అబివృద్ధి పనుల కోసం తాను రూ.25 లక్షలు వరకు సొంత డబ్బులు ఖర్చు చేశానన్నారు. తనకు ఇవ్వాల్సిన బిల్లులు పంచాయతీ కార్యదర్శి పెట్టడంలేదని ఆరోపించారు. తాను అప్పుల ఊబిలో కూరుకుపోయానని తనకు ఆత్మహత్యే శరణ్యం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ రఘునాథరావు గుర్రంపాలెంకు చేరుకొని సచివాలయం తలుపులు తీసి ఆయనను కిందికి దింపారు.



## విద్యార్థుల్లో సృజనాత్మకతకు
# సైన్స్ ఫెయిర్లు దోహదం



**అమలాపురం, పతాకం న్యూస్:** విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంలో సైన్స్ ఫెయిర్‌ల పాత్ర కీలకమని ప్రముఖ ఫిజిక్స్ ఉపాధ్యాయులు బెహరా మూర్తి పేర్కొన్నారు. అమలాపురం, కామనగరువు ఆదిత్య స్కూలులో రెండు రోజులపాటు నిర్వహించిన 'ఇన్నోవియా సైన్స్ ఫెయిర్" కార్యక్రమం విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచింది. ప్రిన్సిపాల్ రామ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ అకాడమిక్ ఉత్సవం ఘనంగా ముగిసింది. ఈ సైన్స్ ఫెయిర్‌లో వివిధ తరగతులకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు 250కి పైగా సైన్స్, గణితం, సోషల్ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రతి ప్రాజెక్టు వెనుక ఉన్న ఆలోచన, పరిశోధన, సాంకేతిక అవగాహన సందర్శకులను ఆకట్టుకుం ది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెహరా మూర్తి మాట్లాడుతూ సైన్స్ అనేది కేవలం పాఠ్యాంశం మాత్రమే కాకుండా ఆధునిక జీవితానికి మూలస్తంభమని చెప్పారు. విద్యార్థులు చిన్న వయసులోనే శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవరచుకుంటే భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పరిశోధకులుగా ఎదగగలరని అన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎస్‌కెబిఆర్ కళాశాల బయాలజీ లెక్చరర్ ఎ.రవీంద్ర, ఫిజిక్స్ లెక్చరర్ జివి.శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రదర్శించిన నమూనాల్లో పవర్ వైర్లెస్ పవర్ ట్రాన్స్‌మిషన్, సోలార్ సిస్టమ్ నమూనా, గణిత ప్రాజెక్ట్ థీమ్‌లు, ఫిజిక్స్‌థీమ్‌లు, స్పోర్ట్స్ థీమ్ ఆకట్టుకున్నాయి. బహుమతి ప్రధానోత్సవ సభలో ప్రిన్సిపల్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ లేని ఆధునిక ప్రపంచాన్ని ఊహించడం అసాధ్యమని స్పష్టం చేశారు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై పిల్లలను ప్రోత్సహించారు. వారి సమక్షంలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థిని అభినందిస్తూ ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ శృతి రెడ్డి, కాలేజీ ప్రిన్సిపల్ చలపతిరావు, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి సుధ శుభాకాంక్షలు తెలిపారు.

## కూలీల ఆటో బోల్తా.. మహిళ మృతి



**తుళ్లూరు, పతాకం న్యూస్:** దుగ్గిరాల మండలం మంచికలపూడికి చెందిన వ్యవసాయ కూలీలు ఉదయం పొలం పనులకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. తుళ్లూరు మండలం పెదపరిమి వైపు ప్రయాణిస్తున్న ఆటో డొంక రోడ్డులో ఉన్న భారీ గొయ్యిని తప్పించుకునే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మహిళా కూలీ యేమినేని వెంకటేశ్వరమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. సిపిఐ సీనియర్ నాయకులు యేమినేని బసవయ్య, యేమినేని జయలక్ష్మి, యార్లగడ్డ వెంకటేశ్వరమ్మ, యార్లగడ్డ మంగమ్మ, చిన్ని శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వారికి చికిత్స కొనసాగు తోంది. ఘటన సమాచారం అందుకున్న సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశ్వర్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రు లను పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన రహదారి దుస్థితిపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఆదుకోవాలి : వ్యవసాయ కార్మిక సంఘంప్రమాదంలో చనిపోయిన యేమినేని వెంకటేశ్వరమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.బాలరాజు, ఇ.అప్పారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చనిపోయిన వెంకటేశ్వరమ్మ కుటుంబానికి రూ.15 లక్షలు, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సాయం చేయాలని కోరారు. ప్రమాదానికి కారణమైన రోడ్డు దుస్థితిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు సొంత గ్రామాల్లో పనుల్లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్న సందర్భంలో ప్రమాదాలకు, గురై చనిపోతున్నారని, వెంటనే ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని సిపిఎం దుగ్గిరాల మండల నాయకులు వై.స్టాలిన్, వైబ్రహ్మే శ్వరరావు, ఎన్.యోగేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, బి.చిరంజీవి, పి.పాములు ఒక ప్రకటనలో కోరారు.

## 60 ఏళ్లుగా పక్కా ఇల్లు నిర్మించుకుని శాశ్వత నివాసం ఉంటున్న పలు కుటుంబాలకు ప్రభుత్వమే న్యాయం చేయాలి



**తాళ్లరేవు, పతాకం న్యూస్:** గత 60 ఏళ్లుగా పక్కా ఇల్లు నిర్మించుకుని శాశ్వత నివాసం ఉంటున్న పలు కుటుంబాల ప్రజలను ప్రభుత్వమే ఆదుకుని న్యాయం చేయాలని జి.వేమవరం గ్రామ ప్రజలు కోరారు. మండలంలోని జి. వేమవరం పంచాయితీ పాదాలమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న భూమి శ్మశాన వాటికకు చెందినదని ఆ భూమిని ఖాళీ చేయాలని రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఆ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా పక్కా ఇల్లు నిర్మించుకుని, స్థిర నివాసం ఏర్పరచుకున్న ప్రజలకు నోటీసులు అందజేశారు. దీనిపై మంగళవారం రెవెనూ అధికారులు ప్రజలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ ప్రాంతంలోని సర్వే నెంబర్ 172/2 లోని లోని 0.63 సెంట్లు భూమి, సర్వేనెంబర్ 173 లోని 1.16 సెంట్ల భూమి శ్మశాన వాటికకు చెందినదని గ్రామానికి చెందిన అనుకూలి బాబూరావు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన కారణంగా హైకోర్టు ఆదేశాల మేరకు నోటీసులు పంపినట్లు పంచాయతీ కార్యదర్శి మోహన్‌ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా భూహక్కుదారుల హక్కు పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న అనుకూలి రాము, టేకుమూడి దేవామణి, దాసరి సత్తిబాబు, ఎర్రంనీడి సుబ్రహ్మణ్యం, పెంకె సూరిబాబు, ఎలంపాలెపు శ్రీను మాట్లాడుతూ 60 ఏళ్ల క్రితం జి. వేమవరం గ్రామానికి చెందిన కుసుబాన్ భార్య షేక్ సతారీ బేబీ వద్ద ఈ భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. ఆ భూమిలో 15 పక్క గృహాలు నిర్మించుకున్నామని, నలుగురు కాలి స్థలాలు కలిగి ఉన్నాయన్నారు. 40 ఏళ్లుగా పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నామన్నారు. గత వందేళ్ళ నుంచి ఇక్కడ ఎటువంటి శ్మశాన వాటిక లేదన్నారు. తమకు అన్యాయం చేయవద్దని కోరారు. స్థానికులకు జనసేన పార్టీ గ్రామ కన్వీనర్ గండి అనిల్, స్థానికులు గండి సత్యనారాయణ, శ్రీపాదం సూర్యనారాయణ, గండి శ్రీను, చిమ్మలపూడి తాతీలు, పుణ్యమంతుల కృష్ణమూర్తి, గండి వెంకటేశ్వర్లు తదితరులు బాధితులకు మద్దతు తెలిపారు. ఎటువంటి ఘర్షణలు జరగకుండా కోరంగి ఎస్ఐ సత్యనారాయణ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆర్ఐ జి.రామకృష్ణ, మండల సర్వేయర్ నిరంజనరావు, విఆర్ఓ సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే..

జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే.. ఈ ఆహారాలను రోజూ తీసుకోవాల్సిందే..! తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చన్న సంగతి అందరికీ తెలిసిందే. కానీ తాజా పండ్లు, కూరగాయలు పొట్టలో మైక్రోబయోమ్ పై, శరీరం మొత్తం మెటబాలిక్ ఆరోగ్యంపై ఎలా ప్రభావాన్ని చూపుతాయో చాలా మందికి తెలియదు. తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చన్న సంగతి అందరికీ తెలిసిందే. కానీ తాజా పండ్లు, కూరగాయలు పొట్టలో మైక్రోబయోమ్ పై, శరీరం మొత్తం మెటబాలిక్ ఆరోగ్యంపై ఎలా ప్రభావాన్ని చూపుతాయో చాలా మందికి తెలియదు. శరీరంలో ఇతర అవయవాలపై ఏవిధంగా శ్రద్ద చూపిస్తామో జీర్ణవ్యవస్థ ఆరోగ్యంపై కూడా అదేవిధంగా శ్రద్ద చూపించడం చాలా అవసరం. జీర్ణవ్యవస్థను రెండవ మెదడు అని కూడా పిలుస్తూ ఉంటారు. జీర్ణక్రియకు, రోగనిరోధక శక్తికి, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి జీర్ణవ్యవస్థ ఆరోగ్యం చాలా ముఖ్యం. జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మొత్తం శరీర శ్రేయస్సును పెంపొందిస్తుంది. చాలా మంది తీసుకునే ఆహారం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. సరైన ఆహారం పొట్టలో మంచి బ్యాక్టీరియా శాతాన్ని మెరుగుపరుస్తుంది. ఫైబర్, ప్రీబయోటిక్, ప్రోబయోటిక్ ఎక్కువగా ఉన్న పదార్థాలను తీసుకోవడం వల్ల పొట్టలో మంచి బ్యాక్టీరియా పెరిగి మెటబాలిక్ ఆరోగ్యం మెరుగుపడుతుంది. పొట్ట ఆరోగ్యాన్ని, పొట్టలో మంచి బ్యాక్టీరియాను పెంచే అనేక రకాల పండ్లు, కూరగాయలు అనేకం అందుబాటులో ఉన్నాయి. వీటిని తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యం మెరుగుపడుతుంది. పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొన్ని రకాల పండ్లు, కూరగాయల గురించి ఇప్పుడు



తెలుసుకుందాం. ఆపిల్ లో పెక్టిన్ అనే ఫైబర్ ఉంటుంది. ఇది ఒక ప్రీబయోటిక్ ఫైబర్. పొట్టలో మంచి బ్యాక్టీరియాకు ఇది ఆహారంగా పని చేస్తుంది. ఆపిల్స్ ను తీసుకోవడం వల్ల పొట్టలో బ్యాక్టీరియా సమతుల్యంగా ఉంటుంది. జీర్ణక్రియ పెరుగుతుంది. మలబద్దకం సమస్య తగ్గుతుంది. ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అరటి పండ్లను తీసుకోవడం ద్వారా కూడా పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. వీటిల్లో రెసిస్టెంట్ స్టార్చ్ పుష్కలంగా ఉంటుంది. ఇది ప్రీబయోటిక్ గా పని చేస్తుంది. పేగులో మంచి బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహించడంలో ఇది దోహదపడుతుంది. అరటిపండ్లను తీసుకోవడం వల్ల పేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. మలబద్దకం సమస్య నుండి సులభంగా బయటపడవచ్చు. సున్నితమైన పొట్ట ఉన్న వారు అరటిపండ్లు తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, యాసిడ్ రిఫ్లెక్స్ వంటి సమస్యలు తగ్గుతాయి. ఆకుకూరలు కూడా పుష్కలంగా ఫైబర్ ను, యాంటీ ఆక్సిడెంట్లను, విటమిన్లను కలిగి ఉంటాయి. వీటిని క్రమం తప్పకుండా తీసు కోవడం వల్ల పేగు కదలికలు ఎక్కువగా ఉం టాయి. తద్వారా మలబద్దకం సమస్య తగ్గు తుంది. ఆకుకూరలను తీసుకోవడం వల్ల పేగులో మంచి బ్యాక్టీరియా శాతం పెరుగు తుంది. జీర్ణవ్యవస్థలో మంట తగ్గుతుంది. వీటిలో ఉండే మెగ్నీషియం జీర్ణవ్యవస్థలోని కండరాలు సరిగ్గా పనిచేయడంలో సహాయపడుతుంది. ఇక చిలగడదుంపల్లో కూడా కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిలో బీటా కెరోటిన్, ఆంథోసైనిన్లు వంటి యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. చిలగడదుంపలను తీసుకోవడం వల్ల పేగులో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా పెరుగుదల చక్కగా ఉంటుంది. పేగు కదలికలు మెరుగుపడతాయి. వీటిలో ఉండే ఫైబర్ ప్రీబయోటిక్‌గా పని చేస్తుంది. చిలగడ దుంపలో ఉండే ఫైబర్, స్టార్చ్ మలబద్దకాన్ని నివారించడంలో సహాయపడతాయి. ఇవి పొట్టలో వాపును తగ్గించి మొత్తం జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతో సహాయపడతాయి. అలాగే క్యారెట్ లలో ఫైబర్ తో పాటు బీటాకెరోటీన్ కూడా పుష్కలంగా ఉంటుంది. పొట్టలో వాపును తగ్గించడంలో, రోగనిరోధకత శక్తిని పెంచడంలో ఇవి దోహదపడతాయి. వీటిలో ఉండే ఫైబర్ పొట్టలో మంచి బ్యాక్టీరియాను పెంచడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల పేగు కదలికలు మెరుగుపడి మలబద్దకం సమస్య తగ్గుతుంది. జీర్ణవ్యవస్థ లైనింగ్ ను దెబ్బతినకుండా కాపాడడంలో క్యారెట్ లు ఎంతో అవకాడోలు..

అవకాడోలు ఫైబర్ తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రీబయోటిక్ సమ్మేళనాలతో ఉంటాయి. ఇవి గట్ మైక్రోబయోమ్ ను పెంచడంలో సహాయపడతాయి. జీర్ణ సమస్యలు ఉన్నవారికి అవకాడోలు ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిలో కరిగే, కరగని రెండు రకాల ఫైబర్ ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. వీటిలో ఉండే ప్రీబయోటిక్ సమ్మేళనాలు గట్ బ్యాక్టీరియాను పోషించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఈ విధంగా తాజా పండ్లు, కూరగాయలు పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతో సహాయపడతాయని పొట్ట ఆరోగ్యం బాగుంటేనే శరీరం మొత్తం ఆరోగ్యం మెరుగుపడుతుందని వైద్యులు చెబుతున్నారు. కనుక శరీరానికి హానిని కలిగించే జంక్ ఫుడ్ కు బదులుగా అందరూ పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఆహారంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# విద్యుత్ మోటర్ వైర్ల దొంగల ముఠా అరెస్ట్



**నంద్యాల, పతాకం న్యూస్:** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్, ఆళ్లగడ్డ ఎస్డిపిఓ ఆదేశాల మేరకు రుద్రవరం పోలీసులు దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వివిధ మండలాల్లో రైతుల బోర్ల వద్ద విద్యుత్ వైర్లను కట్ చేసి దొంగిలిస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాలో నలుగురిని అరెస్ట్ చేసినట్లు సిరివెళ్ల సీఐ డి.రాము బుధవారం వెల్లడించారు. గత కొంతకాలంగా రుద్రవరం, మహానంది, గోస్పాడు, సిరివెళ్ల, ఆళ్లగడ్డ, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల్లోని పొలాల్లో పంప్ సెట్ల వైర్లు దొంగతనానికి గురవుతున్నాయన్నారు. దీనివల్ల రైతులకు ఆర్థికంగానే కాకుండా, సాగు నీరు అందక పంట నష్టం కూడా వాటిల్లుతోందని, దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చేపట్టారు. ఈరోజు తెల్లవారుజామున 5 గంటల సమయంలో రుద్రవరం శివారులోని హెచ్.పి పెట్రోల్ బంక్ వద్ద నిందితులు ఉన్నారనే సమాచారంతో ఎస్ఐ జయప్ప, ఏఎస్ఐ భూపాల్ రెడ్డి, వారి బఅందం దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో సిరివెళ్ళకు చెందిన ఇండ్ల నరసింహులు, ఇండ్ల వెంకటేశ్వర్లు, ఇండ్ల రంగయ్య, అహోబిలం కు చెందిన యాట చిన్నయ్య ఉన్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి దాదాపు 15 కిలోల రాగి వైర్లు గతంలో దొంగిలించిన సొత్తును విక్రయించగా వచ్చిన రూ.1,15,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ వైర్లను కొనుగోలు చేస్తున్న సిరివెళ్ల, ఆళ్లగడ్డకు చెందిన గుజరీ షాపుల యజమానులైన షేక్ హుస్సేన్ బాషా, షేక్ మాలిక్ బాషా, షేక్ ఖాదర్ బాషాలను కూడా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. దొంగలు పగలు పొలాల్లో తిరిగి ఎక్కడెక్కడ మోటార్లు ఉన్నాయో గమనిస్తారని, ఎవరైనా ప్రశ్నిస్తే "పిట్టల కోసం వచ్చాము" అని నమ్మిస్తారని సీఐ తెలిపి రైతులను హెచ్చరించారు. రైతులు తమ పొలాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమర్థవంతంగా పనిచేసిన ఎస్ఐ జయప్ప, ఇతర పోలీసు సిబ్బందిని ఉన్నత అధికారులు అభినందించినట్లు తెలిపారు.

# బొబ్బిలి మున్సిపాల్టీ ప్రజలకు తాగునీటి టెన్షన్

## ఎండిపోతున్న వేగావతి నది.. రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా



**బొబ్బిలి, పతాకం న్యూస్:** బొబ్బిలి ప్రజలకు వేగావతి నదిలో భోజరాజపురం వద్దనున్న ఊటబావుల నుంచి పంపింగ్ చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే నది ఎండిపోతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మార్చి నుంచే ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో నదిలో అంతకంతకూ నీరు తరిగిపోతోంది. ఇప్పటికే కుళాయిల ద్వారా రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మూడు నెలలకు పైగా వేసవి కాలంలో ప్రజలకు తాగునీటిని అందించడానికి అవసరమైన ప్రత్యామ్నాయం కోసం అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. వేసవిలో పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం పెద్దగెడ్డ నీరే బొబ్బిలి, సాలూరు పట్టణాల ప్రజలకే కాకుండా గ్రామీణ తాగునీటి పథకాలకూ ఆధారంగా ఉంటోంది. అక్కడి నుంచి ఏటా మాదిరిగా కొంత నీటిని వేగావతి నదిలోకి విడిచిపెట్టారు. నదిలో ఇసుక బస్తాలతో ఓ వైపు అడ్డుకట్ట వేసి ఊటబావుల్లోకి నీరు చేరేలా చర్యలు తీసుకున్నారు.

వేగావతి నది నుంచి బొబ్బిలి పట్టణం, మండలంలోని తాగునీటి పథకాలకు, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల తాగునీటి పథకాలకు, అలాగే రైతులకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. నది ఎండిపోతుండడంతో రైతులకు రబీ సీజన్‌లో సాగునీరు లేనట్లే. నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న బోరు బావులకు కూడా నీరందని పరిస్థితి నెలకొంది. తాగునీటికి తొలి ప్రాధాన్యం కల్పిస్తూ వేగావతి నది నీటిని పొదుపు చేసి తాగునీటి పథకాలకు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. బొబ్బిలి పట్టణంలోని 31 వార్డుల ప్రజలకు ప్రతి రోజూ 8 ఎంఎల్‌డీ (80లక్షల లీటర్ల) నీరు అవసరం కాగా ప్రస్తుతం ప్రతీ రోజూ 5 ఎంఎల్‌డీ నీటిని మాత్రమే ఇవ్వగలుగుతున్నారు. అన్ని ప్రాంతాలకు సర్దుబాటు చేసేందుకు రోజు విడిచి రోజు విడుదల చేస్తున్నారు. కాగా ఏటా వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం యాడ్వర్స్ సీజనల్ గ్రాంటును స్థానిక సంస్థలకు ప్రభుత్వం ఇచ్చేది. గత ప్రభుత్వ హయాంలో ఈ నిధులకు చెల్లుచీటీ రాయడంతో ఆర్థిక సంఘం నిధులు, మునిసిపల్ జనరల్ ఫండ్ నుంచి తాగునీటి కోసం వెచ్చిస్తున్నారు.

సుమారు వంద కోట్ల రూపాయలతో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సువర్ణముఖి తాగునీటి పథకాన్ని గత ప్రభుత్వం అటకెక్కించింది. ఈ పథకం అంచనా విలువ రూ.25 కోట్లకు పెరిగింది. ఆగిపోయిన తాగునీటి పనులను పునః ప్రారంభించేందుకు ఈ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

తోటపల్లి ప్రాజెక్టు నుంచి ప్రారంభిస్తున్న వాటర్ గ్రిడ్ పథకాన్ని బొబ్బిలి పట్టణ తాగునీటి పథకానికి అనుసంధానం చేసే ప్రతిపాదనను అధికారులు తెరమీదకి తెచ్చారు. సువర్ణముఖి పథకం స్థానంలో తోటపల్లి వాటర్ గ్రిడ్ ద్వారా బొబ్బిలి ప్రజలకు తాగునీరందించాలన్నది లక్ష్యం. అలా అయితే పట్టణంలో ప్రత్యేకంగా ఓ సంప్ నిర్మించి అక్కడ నుంచి తోటపల్లి నీటిని రిజర్వాయర్లకు పంపింగ్ చేయాల్సి ఉంటుంది.

తాత్కాలికంగా పెద్దగెడ్డ నీరు, శాశ్వతంగా తోటపల్లి ప్రాజెక్టు ద్వారా బొబ్బిలి ప్రాంత ప్రజల తాగునీరు అందించవచ్చునని అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు.




# ఫైనల్‌లో బెర్త్ కోసం తలపడనున్న

# దక్షిణాఫ్రికా-న్యూజిలాండ్





టీ20 వరల్డ్‌కప్ కీలక దశకు చేరింది. టైటిల్ విజేతను తేల్చేందుకు ఇక మరో మూడు మ్యాచ్‌లు మాత్రమే మిగిలాయి. ఈ నేపథ్యంలోసమీఫైనల్స్‌కు తెర లేవనుంది. ముందుగా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే తొలి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికా-న్యూజిలాండ్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. టోర్నీలో తామాడిన ఏడు మ్యాచ్‌ల్లో సఫారీలకు ఓటమన్నదే లేదు. ఇక, ఈ పోరులోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్న మార్‌క్రమ్ బృందం.. వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరాలనుకుంటోంది. న్యూజిలాండ్ మాత్రం కాస్త తడబడుతూనే ఇక్కడిదాకా రాగలిగింది. అలాగే గ్రూప్ 'డి'లో ఇదివరకే సౌతాఫ్రికా చేతిలో చిత్తుగా ఓడింది. కానీ ఈ నాకౌట్ పోరులో పూర్తి స్థాయిలో చెలరేగి గ్రూప్ దశలో ఓటమికి బదులివ్వడమే కాకుండా, తుదిపోరుకు సైతం కివీస్ అర్హత సాధించాలనుకుంటోంది.

ప్రత్యర్థి ఎంత బలంగా ఉన్నా న్యూజిలాండ్‌ను తక్కువ అంచనా వేస్తే ప్రమాదం తప్పదు. ఓపెనర్లు సైఫర్ట్, ఆలెన్ కుదురుకుంటే పరుగుల వరద ఖాయం. అలాగే గ్లెన్ ఫిలిప్స్, మిచెల్, రచిన్ చివర్లో శాంట్నర్‌లతో కివీస్ బ్యాటింగ్‌కు తిరుగులేదు. అటు బౌలింగ్‌లో పేసర్ మ్యాట్ హెన్రీ తొలి ఓవర్‌లోనే వికెట్ తీయడాన్ని అలవాటుగా చేసుకున్నాడు. అతడికి జతగా ఫెర్గూసన్ చెలరేగుతుండడంతో పవర్‌ప్లేలో సఫారీలను అడ్డుకుంటే కివీస్ పైచేయి సాధిస్తుందనడంలో సందేహం లేదు. శాంట్నర్, రచిన్, ఫిలిప్స్, మెకాంచీ, సోధీ రూపంలో ఐదుగురు స్పిన్నర్లు ఉండడం జట్టుకు లాభించే అంశం. అయితే మెకాంచీ స్థానంలో మరో పేసర్ డఫీని తీసుకునే అవకాశం ఉంది. అన్ని విభాగాలు సమష్టిగా రాణిస్తే సౌతాఫ్రికాను ఓడించడం కివీస్‌కు ఏమంత కష్టం కాదు.

దక్షిణాఫ్రికా జట్టు అన్ని విభాగాల్లోనూ పటిష్టంగా కనిపిస్తోంది. టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్‌లోనూ విధ్వంసం సృష్టించగల బ్యాటర్లకు కొదువ లేదు. అయితే ఓపెనర్ డికాక్ నుంచి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ రాకపోవడం లోటుగా ఉంది. కానీ మార్‌క్రమ్ పవర్‌ప్లేలో బాదుడుకు జట్టు ఆరంభం నుంచే దూసుకెళ్తోంది. వెటరన్ మిల్లర్ నిలకడగా రాణిస్తున్నాడు. అలాగే యువ ఆటగాళ్లు బ్రెవిస్, స్టబ్స్ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయడం లేదు. ఇక బౌలింగ్ విషయానికి వస్తే.. పేసర్ ఎన్‌గిడి, యాన్సెన్ ప్రత్యర్థి బ్యాటర్లను కుదురుకోనీయడం లేదు. ముఖ్యంగా ఎన్‌గిడి తన స్లో బంతులు, వైడ్ యార్కర్లతో అద్భుతంగా కట్టడి చేస్తున్నాడు. సీనియర్ పేసర్ రబాడ చెలరేగితే కివీస్‌కు కష్టాలు తప్పవు. జట్టులో కేశవ్ మహరాజ్ ఏకైక స్పిన్నర్‌గా ఉండగా, మార్‌క్రమ్ పార్ట్‌టైమ్ బౌలింగ్ కూడా జట్టుకు ఉపయోగపడనుంది.

# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. అగ్రస్థానంలోనే కొనసాగుతున్న అభిషేక్ శర్మ



టీ20 ప్రపంచ కప్ 2026 సమరం రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే సూపర్ 8 నుంచి నాలుగు జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. తొలి సెమీ ఫైనల్ మ్యాచ్ నేడు ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికా-న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనుంది. ఈ నేపథ్యంలో ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్ జాబితాను విడుదల చేసింది. ఈ మెగా టోర్నీ ఆరంభం నాటి విఫలమవుతూ వస్తున్నప్పటికీ.. టీమిండియా స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ 874 పాయింట్లతో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. జింబాబ్వేపై హాఫ్ సెంచరీ మినహా అభిషేక్ ఈ టోర్నీలో పరుగులు రాబట్టలేకపోయాడు. భారీ అంచనాలతో బరిలోకి దిగి వరుసగా మూడు డకౌట్లు, ఓ మ్యాచ్‌లో 15 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా నిరాశపర్చాడు. కాగా పాకిస్థాన్ బ్యాటర్ ఫర్హాన్ ఈ టోర్నీలో రెండు సెంచరీలు చేసి 848 పాయింట్లతో రెండో స్థానానికి దూసుకొచ్చాడు. అభిషేక్ శర్మ ఫామ్ అందుకుని పరుగులు చేయలేకపోతే.. తన స్థానాన్ని కోల్పోవడం ఖాయమే. కాగా పొట్టి ప్రపంచ కప్ టోర్నీలో అద్భుత ప్రదర్శనలు చేసిన ఇషాన్ కిషన్(783).. 15వ స్థానం నుంచి ఒకేసారి నాలుగో స్థానానికి దూసుకొచ్చాడు. తిలక్ వర్మ(749), కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్(739) ఐదు, ఆరో స్థానాల్లో కొనసాగుతున్నారు. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ బౌలింగ్ జాబితాలో టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 771 పాయింట్లతో తన అగ్రస్థానాన్ని పదిలపర్చుకున్నాడు. ప్రపంచ కప్ ఆఖరి రెండు మ్యాచుల్లో కాస్త పరుగులు సమర్పించుకున్నప్పటికీ.. వికెట్లు తీసుకున్నాడు. దీంతో తన స్థానం పదిలంగా ఉంది. రెండో స్థానంలో అఫ్గానిస్తాన్ బౌలర్ రషీద్ ఖాన్ 753 పాయింట్లతో ఉన్నాడు. పాకిస్థాన్ ప్లేయర్ అబ్రార్ అహ్మద్(736) మూడో స్థానానికి దూసుకొచ్చాడు. బుమ్రా(671) ఏడో స్థానంలో ఉండగా.. అర్షదీప్ సింగ్(653) 13వ స్థానంలో కొనసాగుతున్నారు. ఇక ఆల్‌రౌండర్ జాబితాలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా(328) అగ్రస్థానంలో ఉన్నాడు.




# అనుకున్న సమయం కంటే ముందే 'ఉస్తాద్ భగత్‌సింగ్!'



పవర్?స్టార్ పవన్? కల్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్?సింగ్' అనుకున్న సమయం కంటే ముందే రిలీజ్ అవుతుందనే ప్రచారం జోరుగా సాగుతుంది. మార్చి 26న విడుదల కావాల్సిన ఈ మూవీని 19కే రిలీజ్ చేసేలా మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. రాకింగ్ స్టార్ యశ్ నటించిన 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' సినిమా మార్చి 19న విడుదల కావాల్సి ఉంది. కానీ అది ఇప్పుడు జూన్? 4కు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఆ డేట్?ను తీసుకోవాలని 'ఉస్తాద్ భగత్‌సింగ్' మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పవర్‌స్టార్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు.

అయితే తెలుగు వారి నూతన సంవత్సరమైన ఉగాది పండగ ఈ ఏడాది మార్చి 19న ఉంది. ఈ పండగ సందర్భంగా సినిమాను థియేటర్లలో రిలీజ్ చేయాలని మూవీ మేకర్స్? ప్రయత్నిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. దీంతోపాటుగా రంజాన్ కూడా ఉండడంతో లాంగ్ వీకెండ్ కూడా కలిసి వస్తుందని భావిస్తున్నారట. అందుకే మార్చి 19న సినిమా విడుదలకు సిద్ధంగా ఉండాలని డిస్ట్రిబ్యూటర్లకు కూడా సమాచారం అందించారని ఇన్?సైడ్ టాక్ వినిపిస్తుంది. కానీ దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది.

## జూమ్ చేసి హీరోయిన్ల ఫొటోలు

# తీయడమేమిటి?: సప్తమి గౌడ



పబ్లిక్ ఈవెంట్‌లలో పాల్గొంటున్న సినీ నటీమణులను అభ్యంతర కోణాల్లో ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టు చేస్తున్నారని ప్రముఖ కన్నడ నటి సప్తమి గౌడ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుచిత కోణాల్లో జూమ్ చేసి పోస్టు చేయడం సరికాదని ఆమె కొంతమంది ఫొటో, వీడియో గ్రాఫర్లపై మండిపడ్డారు. ఇటీవల విడుదలైన ది రైజ్ ఆఫ్ అశోకలో సప్తమి గౌడ నటించారు. తాజాగా ఆమె సామాజిక మాధ్యమం వేదికగా నటీమణులను అనుచితంగా చూపిస్తూ చేస్తున్న పోస్టులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నటీమణుల శరీరాలకు సంబంధించిన ఫొటోలను, వీడియోలను పెడుతూ కొందరు వ్యక్తులు అనుసరిస్తున్న తీరు ఏమాత్రం సరికాదని అన్నారు. ఇది మహిళలను అవమానించడమేనని పేర్కొన్నారు. మేం మా నటన ద్వారా అలరించడానికి మాత్రమే సినిమాల్లో ఉన్నామని అన్నారు.

ఉద్దేశపూర్వకంగా వీడియోలను, ఫొటోలను జూమ్ చేసి పోస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. ఈవెంట్‌లను కవర్ చేసే వారు కూడా తమ వృత్తికి గౌరవం ఇచ్చేలా వ్యవహరించాలని సూచించారు. తద్వారా వారు తమ మర్యాదను కాపాడుకోవాలని అన్నారు. ఈ విషయంలో ప్రతి నటీమణికి తాము అండగా ఉంటామని, పరస్పరం మద్దతుగా నిలుస్తామని అన్నారు. నటీమణుల పట్ల అనుచితంగా ఉన్న కొంతమందికి వ్యతిరేకంగా అందరూ అండగా నిలవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# తన సెకండ్ ఇన్నింగ్స్ పై లయ కీలక వ్యాఖ్యలు



టాలీవుడ్‌లో హోమ్లీ ఇమేజ్‌తో మెప్పించిన నటి లయ, దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ వెండితెరపై మెరవనున్నారు. శివాజీతో కలిసి ఆమె నటించిన డార్క్ కామెడీ క్రైమ్ థ్రిల్లర్ 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రమోషన్స్‌లో లయ తన కొత్త ఇన్నింగ్స్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

ఈ సినిమాలో తన పాత సాఫ్ట్ ఇమేజ్‌కు భిన్నంగా 'ఉత్తర' అనే స్వార్థపరురాలైన భార్య పాత్రలో కనిపిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. భర్తను (శివాజీ) ముప్పుతిప్పలు పెట్టే ఈ పాత్ర, కథలో చాలా కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు.

కేవలం ఏడుపుగొట్టు పాత్రలకే పరిమితం కాకుండా, సెకండ్ ఇన్నింగ్స్‌లో పవర్‌ఫుల్ రోల్స్ చేయాలని ఉందని ఆమె ఆకాంక్షించారు. ప్రస్తుతం జగపతిబాబుతో కలిసి 'వదలా' అనే సైకలాజికల్ థ్రిల్లర్‌తో పాటు, శ్రీకాంత్‌తో ఒక సోషియో ఫాంటసీ చిత్రంలో కూడా నటిస్తున్నట్లు తెలిపారు. కథలో బలం ఉంటే చిన్న పాత్రలకైనా తాను సిద్ధమని స్పష్టం చేశారు. ఈటీవీ విన్, శివాజీ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచుతుందని ధీమా వ్యక్తం చేశారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**